# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

మంగళవారం, అక్టోబర్ 22, 2024 | సంపుటి - 20 | సంచిక 27 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దు

### ఖలిస్తాన్ ఉగ్రవాది పన్నూ హెచ్చరికలు



న్యూఢిల్లీ : దేశంలో గత కొన్ని రోజులు గా విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల వేళ ఖలిస్థానీ వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ 'ఎయిర్ ఇండియా'కు హెచ్చరికలు చేయడం తీవ్ర కలకలం రేపింది. 2లో








## దేశ భద్రత, ప్రజల రక్షణలో

# పోలీసుల పాత్ర ఎనలేనిది

### ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణం

- రాష్ట్ర అభివృద్ధిలోనూ పోలీసులదే కీలక బాధ్యత
- శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడి అవకాశాలు
- అమరులైన పోలీస్ కుటుంబాలను ఆదుకుంటాం
- మరణించిన పోలీస్ కుటుంబాలకు 2కోట్ల వరకు సాయం
- అమరపోలీసులకు నివాళి అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి



శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసి అమరులైన పోలీసులకు సీఎం నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ ప్రసంగిస్తూ.. అమరులైన పోలీస్ అధికారులందరికీ ప్రభుత్వం తరపున ఘన నివాళు లర్పించారు. 140 కోట్ల దేశ జనాభా ప్రశాంతంగా ఉంటున్నారంటే అందుకు పోలీసులే కారణమన్నారు. రాష్ట్రం అభివృద్ధి పదంవైపు నడవాలంటే పోలీసులు కీలకమన్నారు. నిరుద్యోగుల సమస్య, శాంతి భద్రత లేని రాష్ట్రం ఉంటే పెట్టుబడులు రావని.. రాష్ట్రం అభివృద్ధికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అమరులైన పోలీస్ అధికారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు. 'పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవ ద్దని కోరుతున్నానని అన్నారు. మిగతా 2లో

# ఆర్థిక ఇబ్బందుల్లో సమర్థ పనితీరు



### ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్

### ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో మోడీ

న్యూఢిల్లీ : ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందన్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు. 'మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. 2లో

## గ్రూప్-1 పరీక్షల్లో

# జోక్యం చేసుకోలేం


### మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

### యధాతథంగా గ్రూప్ పరీక్షల నిర్వహణ



న్యూఢిల్లీ :

తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని 2లో



2లో

## ప్రశాంతంగా తొలిరోజు గ్రూప్-1 పరీక్షలు

### అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం

హైదరాబాద్ : తెలంగాణలో తొలిరోజు గ్రూప్-1 పరీక్ష ముగిసింది. పరీక్షకు వెళ్లే అభ్యర్థులకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మెయిన్స్ పరీక్షలు మొదలయ్యాయి. ఈ నెల 27 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. పలు చోట్ల పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పోలీసులు కేంద్రాల్లోకి అనుమతించలేదు. పలుచోట్ల అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని సిబ్బంది పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు.

## హిందూదేవాలయాలపై

# దాడులు దుర్మార్గం

### నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రభుత్వం

### గవర్నర్‌ను కలిసి విన్నవించిన బిజెపి బృందం

హైదరాబాద్ : సోమవారం ఉదయం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. ముత్యాలమ్మ గుడిపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం నేతలు రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. ముత్యాలమ్మ గుడి మీద దాడి చేస్తే నిందితుడిని పిచ్చోడని ముద్ర వేసి వదిలేసే ప్రయత్నం చేశారని ఈటల మండిపడ్డారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా కొంతమంది చేస్తున్నారన్నారు. శాంతియుతంగా ర్యాలీ తీస్తుంటే పోలీసులు దుర్మార్గంగా లాఠీ ఛార్జ్ చేసి అరెస్టులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రదాడులకు నగరంలో ఎంతో మంది బలయ్యారన్నారు. మిగతా 2లో



హిందూ దేవాలయాల మీద కొంతమంది దాడి చేస్తున్నారని.. దీనిపై ప్రభుత్వం నిమ్మకునీరెతినట్లు వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు ఉపేక్షించడం సరికాదన్నారు.

## విమానయాన భద్రతలో

# ప్రభుత్వం రాజీపడదు

### బెదిరింపు కాల్స్ చేసే వారికి జీవిత ఖైదు

### విమానయాన చట్టాల సవరణకు యత్నిస్తున్నాం

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



న్యూఢిల్లీ : విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం బూటకమని తేలిందన్నారు. పౌర విమాన యాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని.. దానినే తమ శాఖ, విమానయాన సంస్థలు అనుసరిస్తోందని వివరించారు. ఇలాంటి బెది రింపులు వచ్చిన సమయంలో పరిస్థితి చాలా సున్నితంగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ విధివిధానాలను మిగతా 2లో

## గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ,

# మైనార్టీలకు అన్యాయం

### సుప్రీంకోర్టు కేసును తిరస్కరించలేదు

### మీడియా సమావేశంలో కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్ : గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. జీవో 29, జీవో 46 తప్పని హైకోర్టులో రుజువు చేయిస్తామని, సమర్థ వంతమైన న్యాయవాదితో వాదనలు వినిపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గ్రూప్-1 అభ్యర్థుల తరపున తమ పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజు శ్రవణ్.. పది మంది గ్రూప్-1 అభ్యర్థులతో కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మిగతా 2లో



## సియోల్‌లో మంత్రుల బృందం

# పర్యటన

### చెత్త తరలింపు..విద్యుత్ ఉత్పత్తిపై పరిశీలన

### అతిపెద్ద మాపో ప్లాంట్ పనితీరుపై అధ్యయనం

హైదరాబాద్ : దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను మంత్రుల బృందం సందర్శించింది. అలాగే అక్కడ చెత్త సేకరణ, మురికి నీటి నిర్వహణ తదితర పద్ధతులను కూడా పరిశీలించింది. సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. 2లో

## మనదేశంలో ఓ మాదిరిగా..

# వారి దేశంలో మరోమాదిరి

### అందుకే దౌత్యవేత్తలను కెనడా నుంచి రప్పించాం

### కెనడా తీరుపై అసమనం వ్యక్తం చేసిన మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ : భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన క్రమంలో.. తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని.. 2లో

# ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దు

నవంబరు 1 నుంచి 19వ తేదీల మధ్యలో ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని అతడు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పన్నూ అన్నాడు. అందులో ఆయా తేదీల్లో ఆ సంస్థ విమానాల్లో ప్రయాణించొద్దంటూ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాగా.. పన్నూ ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇది తొలిసారి కాదు. గత నవంబరులోనూ ఇలాంటి వీడియో విడుదల చేశాడు. నవంబరు 19న దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆ రోజు మూతపడుతుందని, దాని పేరు కూడా మార్చేస్తామని గతేడాది అతడు ఓ వీడియోలో హెచ్చరించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థను 2007లో స్థాపించగా.. వ్యవస్థాపకుల్లో గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఒకడు. ఈ సంస్థను భారత్ 2019లోనే నిషేధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు అమెరికాలో ఉన్నట్లు సమాచారం. పన్నూకు అగ్రరాజ్యంతో పాటు కెనడా పౌరసత్వం కూడా ఉంది.

# ఆర్థిక ఇబ్బందుల్లో సమర్థ పనితీరు

ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్‌లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చింది. టెలికామ్-డిజిటల్ ఫ్యూచర్‌పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండెక్టర్ ఎకోసిస్టమ్‌పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి‘ అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతిథులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు.

# సియోల్‌లో మంత్రుల బృందం పర్యటన

మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

# మనదేశంలో ఓ మాదరిగా.. వారి దేశంలో మరోమాదిరి

అందుకే మన హైకమిషనర్‌తో పాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని చెప్పారు. ఓ జాతీయ వార్తా ఛానెల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన.. ఆ దేశంతో సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. ‘పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరింది. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవడాన్ని ఎంచుకున్నాం. దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి కెనడాలో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బంది కరంగా మారినట్లు కనిపిస్తోంది. అదే భారత్‌లో.. కెనడా దౌత్యవేత్తలు మాత్రం మన సైన్యం, పోలీసుల సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించడం, నిర్దేశిత పౌరులను కెనడాలో అడ్డుకునేందుకు మాత్రం ఎటువంటి చర్యలుండవు ‘ అని కెనడా తీరుపై జైశంకర్ మండిపడ్డారు. ‘అక్కడా, ఇక్కడా వారి తీరు భిన్నంగా ఉంది. భారత్‌కు చెందిన నేతలు, దౌత్యవేత్తలను మీ పౌరులు బహిరంగంగా బెదిరిస్తున్నారు అని మనం చెబితే.. వాక్ స్వాతంత్య్రం అంటారు. భారత హైకమిషనర్‌ను బెదిరించినా భావ ప్రకటనా స్వేచ్ఛ కింద పరిగణించాలని అంటున్నారు. అదే భారత్‌లోని కెనడా దౌత్యవేత్త సౌత్‌బ్లాక్ నుంచి కోపంతో బయటకు వచ్చారని ఓ భారత జర్నలిస్టు పేర్కొంటే మాత్రం.. విదేశీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. వారి దేశంలో ఒక మాదిరిగా వ్యవహరిస్తాం. విదేశాల్లో అవి మీకు వర్తించవు అని అంటున్నారు. ఇదీ మారుతున్న ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పరిస్థితులు‘ అని కెనడాను ఉద్దేశిస్తూ భారత విదేశాంగ మంత్రి చురకలు అంటించారు. 1945 తర్వాత ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ప్రభావం ఎక్కువగా ఉండేదన్న జైశంకర్.. గడిచిన 20-25 ఏళ్లలో పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. పాశ్చాత్యేతర దేశాల వాటా, భాగస్వామ్యం, ప్రభావం పెరిగిందని.. ఈ నేపథ్యంలో వివాదాలు, ఘర్షణలు, వాదనలు సహజమేనన్నారు. ఈ క్రమంలో కొన్ని దేశాల మధ్య సంబంధాలు అంత సాఫీగా ఉండవని విదేశాంగ మంత్రి అంచనా వేశారు.

# దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిది

విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్ ల్యాబ్ అనేక రాష్ట్రలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశంలోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది. ఇవాళ డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ వల్ల పంజాబ్ అనేక కష్టాలు ఎదుర్కొంటోంది. మాదకద్రవ్యాల వినియోగం రాష్ట్రంలో క్రమంగా పెరుగుతోంది. వీటి నివారణకు రాష్ట్రంలో టీజీన్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఏఐ పరిజ్ఞానంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించేవారిని గుర్తిస్తున్నాం. నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సేవలు మరచిపోలేము. జీతం కోసం వారు పనిచేయడం లేదని అన్నారు.

బాధ్యతాయుతంగా భావించి సేవలు అందిస్తున్నారు‘ అని రేవంత్‌రెడ్డి తెలిపారు. తీవ్రవాదులు, మావోయిస్టు చేతుల్లో మరణించిన అధికారులను స్మరించుకోవడం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. డ్రగ్స్ మహమ్మారి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు.దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. మందిరాల మీద, మజీద్‌ల మీద దాడులు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవల ముత్యాలమ్మ గుడిపై దాడి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శాంతి భద్రతలు తమ చేతిల్లోకి తీసుకునే వారి పట్ల కఠినంగా ఉండాలని తెలిపారు. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుకోవడంలో పోలీస్ సేవలు మరచిపోలేమని కొనియాడారు. జీతం కోసం పోలీస్ సిబ్బంది పనిచేయడం లేదని.. బాధ్యతాయుతంగా భావించి పోలీసులు సేవలు అందిస్తున్నారన్నారు. క్రిమినల్స్‌తో పోలీసులు ఫ్రెండ్లీగా ఉండడం కాదని.. బాధితులతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. క్రిమినల్స్ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీస్ కుటుంబాల కోసం యంగ్ ఇండియా స్కూల్‌ను ఈరోజు ప్రారంభిస్తున్నామన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని.. ఈరోజు పునాది వేస్తున్నామన్నారు. వచ్చే అకాడమీ నుంచి విద్యా సంస్థ ప్రారంభిస్తామని చెప్పారు. నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహారించాలని స్పష్టం చేశారు. ‘పోలీస్ సమస్యలు ఏమున్నా నా దగ్గరికి తీసుకువస్తే నేను పరిష్కరిస్తాను‘ అని తెలిపారు. వీర మరణం పొందిన పోలీస్ కుటుంబాలకు ఇక నుంచి కోటి రూపాయలు నష్ట పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌కు కోటి రూపాయలు, సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్‌లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎస్పీలకు కోటి 50 లక్షలు, ఐపీఎస్ కుటుంబాలకు 2 కోట్లు ఇస్తామని.. అలాగే శాశ్వతంగా అంగవైకల్యం పొందిన కుటుంబాలకు కూడా నష్ట పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఇంతే కాకుండా చనిపోయిన కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 214 మంది పోలీసులు అమరులు అయ్యారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక పోలీస్ అధికారి ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రవీణ్ అనే కానిస్టేబుల్ అమరుడు అయ్యారని.. వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిందని చెప్పారు. తెలంగాణ పోలీస్ శాఖ శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీపడడం లేదని స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు.. వాటికి కావాల్సిన సౌకర్యాలు అన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీస్ శాఖ ముందు వరుసలో ఉందని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని చెప్పారు. తెలంగాణ రాష్టం నుంచి ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసు శాఖ ముందు వరుసలో ఉందని వివరించారు.

# గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. మరికొద్ది గంటల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుత దశలో పరీక్షల నిర్వహణలో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. పరీక్షల వాయిదాకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించడంతో దీంతో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల కోసం టీజీపీఎస్సీ పూర్తి ఏర్పాట్లు చేసింది. అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను టీజీపీఎస్సీ ఏర్పాటుచేసింది. అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో వాయిదాపడుతూ వచ్చింది. దీంతో ఎలాంటి లోపాలు లేకుండా పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసింది. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ టీవీలను పర్యవేక్షించనుంది. పరీక్షల నిర్వహణలో ప్రతి షిఫ్ట్‌లో కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలను అధికారులు జారీచేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకై ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

## విమానయాన భద్రతలో ప్రభుత్వం రాజీపడదు

మనం అనుసరించాలని ఆయన వ్యాఖ్యానించారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు.విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడేవారికి ఇటువంటి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో సెక్షన్లు ఉన్నాయి. కానీ, ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో ఉగ్రకోణంపై స్పందించేందుకు కేంద్ర మంత్రి నిరాకరించారు. అక్టోబర్ 14 నుంచి పలు విమానాలకు దాదాపు 100 బెదిరింపులు వచ్చాయి. ఈ అంశంపై పలు వర్గాలతో సమావేశాలు నిర్వహించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతా నిబంధనల సవరణ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. 1982 సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చట్టాన్ని సవరించే అంశంపై వివిధ శాఖలతో కూడా చర్చిస్తున్నట్లు వివరించారు. ‘గత వారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించాము. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి వేగంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకొన్నాం. అవి తప్పుడు బెదిరింపులైనా.. భద్రత, సురక్షిత విషయంలో రాజీ పడటంలేదు. ప్రయాణికుల ప్రాణాలే మాకు ముఖ్యం. అదే సమయంలో ఒక్క విమానాన్నైనా దారి మళ్లించాలనో, జాప్యం చేయాలనో మేము అనుకోవడం లేదు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి వీటిపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మెరుగైన పరిస్థితిని చూస్తాం‘ అని కేంద్ర మంత్రి చెప్పారు. శనివారం ఒక్కరోజే 30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా.. ఆదివారం సైతం 24 విమానాలకు వచ్చాయి. ఇండిగో, విస్తారా, ఎయిరిండియా, ఆకాశ ఎయిర్‌తోపాటు పలు అంతర్జాతీయ సర్వీసు విమానాలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇండిగో, విస్తారా, ఎయిరిండియాకు చెందిన విమానాలు ఆరు చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బెదిరింపుల గురించి సంబంధిత అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు భద్రతా విధానాలను పాటిస్తున్నామని విమానయాన సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. ఈ వారంలో 90కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ నకిలీవేనని అధికారులు తేల్చారు.

## గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం

తమ పిటిషన్ తరపున కపిల్ సిబల్ బలమైన వాదనలు వినిపించారు. పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించలేదు. ఇవాళ పరీక్ష ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఆపడం కరెక్ట్ కాదు. గ్రూప్-1 అభ్యర్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ మీద హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకు ఫలితాలను ప్రకటించొద్దని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. త్వరగా విచారణ జరిపి న్యాయం చేయాలని కూడా సుప్రీంకోర్టు చెప్పిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో జీవో 55 తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు న్యాయం జరగాలని జీవో 55 తెచ్చాం. ఓపెన్ కోటాలో కూడా రిజర్వ్‌డ్ వారికి అవకాశం కల్పించే విధంగా జీవో 55 తీసుకొచ్చాం. జీవో 29పై తాము జూన్, జులై నుంచి మొత్తుకుంటున్నాం. శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రెస్‌మీట్ పెట్టి ఆర్‌ఎస్పీ, దాసోజు శ్రవణ్ పలుమార్లు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖపు వైఖరి వల్ల గందరగోళాల మధ్య పరీక్ష నిర్వహించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 63 పోస్టులకు 30 వేల మంది పోటీ పడుతున్నారు. వారం రోజుల పాటు పరీక్షలు రాయాలి. మనసులో ఎంతో ప్రశాంతత ఉండాలి. కానీ ఈ ప్రభుత్వం వారిని హింసించింది. కోర్టులో కేసు ఉంది.. తెగేదాకా ఆగండి అంటే కూడా కనికరించలేదు. జీవో 29 రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదంటే మేం ఎక్కడ చావాలి అని అడిగారు. పరీక్షలు ఎలా రాయాలని అడిగారు. కొంచెం వాయిదా వేయండని అడిగారు. ధర్నాలు, దరఖాస్తులు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. బలహీన వర్గాలను అణిచివేస్తోంది. జీవో 55కి తూట్లు పొడిచింది. తెలంగాణేతర పిల్లలకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తోంది. హైకోర్టులో కూడా గ్రూప్-1 అభ్యర్థుల తరపున కొట్లాడుతాం. టాప్ లాయర్‌ను తీసుకొస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిందే నిరుద్యోగులు. ఇప్పుడేమో వారిని జీవో 29 తీసుకొచ్చి మోసం చేస్తున్నారు. జీవో 46కు సంబంధించిన పిల్లల కోసం కూడా సుప్రీంకోర్టులో కొట్లాడుతాం. గ్రూప్-4లో బ్యాక్ లాగ్ పోస్టులు కానివ్వొద్దని కోరుతున్నారు. ఇకపోతే సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు రహస్య మిత్రులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ కుర్చీ పోతుంటే బండి సంజయ్‌కు అంత బాధ ఎందుకని ప్రశ్నించారు. బండి సంజయ్ కామెంట్లపై స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలవి రహస్య ఒప్పందాలని.. ఖచ్చితంగా బయటకు వస్తాయని కేటీఆర్ అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి వార్షికోత్సవం జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. ముత్యాలమ్మ గుడిపై దాడిని తాను ఖండిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. తాను ట్వీట్ చేసినందుకు సైబర్ క్రైమ్ అధికారులు లేఖ పంపారని అన్నారు. రేవంత్‌రెడ్డి లాంటి దగుల్బాజీ ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరని విమర్శించారు. ఉద్యోగాల కల్పనపై సీఎం రేవంత్ అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కంటే జర్నలిస్టులే ఎక్కువ ప్రశ్నించాలని కేటీఆర్ అన్నారు. రేవంత్ ప్రభుత్వం లక్షన్నర కోట్లు మూసీలో పోద్దామంటే చూస్తూ ఊరుకుందామా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసంబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం రాష్ట్ర పురోగతికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ చార్జీలను రూ.10నుంచి రూ.50కు పెంచాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇప్పటికే కరెంటు కోతలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ‘రేవంత్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పరిశ్రమలు తెలంగాణ నుంచి తరలిపోతున్నాయి. విద్యుత్ చార్జీలు పెంచి రూ. 18వేల 500కోట్ల రూపాయల అదనపు భారాన్ని ప్రజలపై ప్రభుత్వం మోపనుంది. చార్జీల పెంపునకు 9ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమమించుకోవాలి. ఇళ్లల్లో వాడుకునే కరెంట్‌కు 300యూనిట్లు దాటితే 10రూపాయలు ఉన్న పిక్స్‌డ్ చార్జిను 50రూపాయలు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల అన్నిటినీ ఒకటే కేటగిరి కిందకు తీసుకురావాలనుకోవటం దుర్మార్గం. కాంగ్రెస్ చేతకానితనంతో ఫాక్స్‌కాన్ పరిశ్రమ తెలంగాణ నుంచి తరలిపోయింది. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యుత్‌లో తెలంగాణ నంబర్ వన్‌గా ఉండేది. ఈనెల 23న ఈఆర్సీ నిర్వహిస్తోన్న పబ్లిక్ హియరింగ్‌కు బీఆర్ఎస్ బృందం హాజరవుతోందని అన్నారు.

# ప్రశాంతంగా తొలిరోజు గ్రూఫ్-1 పరీక్షలు

ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా గేట్లు తాళం వేయడంతో అక్కడే ఉన్న సిబ్బందిని అభ్యర్థులు చాలాసేపు వేడుకున్నారు. గేటు పట్టుకుని రోదిస్తూ దయచేసి పంపించాలని వేడుకున్నారు. కానీ నిబంధనల ప్రకారం అనుమతించేది లేదని సిబ్బంది చెప్పారు. దీంతో చాలామంది వెనుతిరిగారు. సికింద్రాబాద్‌లోని పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన మాథ్యూస్ అనే అభ్యర్థిని పోలీసులు అనుమతించలేదు. దీంతో గోడ దూకి పరీక్ష కేంద్రం వైపు పరుగులుపెట్టాడు. ఇది గమనించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దుండిగల్‌లో ఓ అభ్యర్థిని పొరపాటున తన పరీక్షా కేంద్రానికి కాకుండా వేరే పరీక్షా కేంద్రానికి వెళ్లింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు సిబ్బంది విషయం తెలుసుకుని ఆమెకు సాయం చేశాడు. వెంటనే ఆమెను తన బైక్‌పై ఎక్కించుకుని సకాలంలో సరైన పరీక్షా కేంద్రం వద్ద దింపాడు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణకు ఉండటంతో పరీక్ష వాయిదా పడుతుందేమోనని అనుకున్నారు.నవంబర్ 20లోగా విచారణ పూర్తి చేయాలని హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్న నేపథ్యంలో.. ఈ దశలో పరీక్షల వాయిదాపై జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో షెడ్యూల్ ప్రకారం గ్రూప్-1 పరీక్షలు మొదలయ్యాయి. పరీక్ష వాయిదా వేయాలని ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. ఎగ్జామ్ హాల్, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించారు. ఇదిలావుంటే పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ‘గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు నా శుభాకాంక్షలు. ఎటువంటి ఆందోళన చెందకుండా పూర్తి ఏకాగ్రతతో పరీక్షలు రాయండి. ఈ పరీక్షల్లో మీరు విజయం సాధించి తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను‘ అని సీఎం పేర్కొన్నారు.

# హిందూదేవాలయాలపై దాడులు దుర్మార్గం

మళ్లీ అలాంటి దాడులకే దుర్మార్గులు కుట్ర చేస్తున్నారని.. నిందితులను కఠినంగా శిక్షించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సూచించాలని గవర్నర్‌ను కోరామన్నారు. పోలీసులే మఫ్టీలో రెచ్చగొట్టి ర్యాలీలో దాడులు, లాఠీఛార్జ్ జరిగేలా చేశారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. హిందూ దేవాలయాల మీద దాడి జరిగితే సీఎం రేవంత్ ఇంత వరకు ఖండించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం నిరంకుశ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. హిందూ దేవాలయాల మీద దాడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిందితుల మీద ప్రభుత్వం కేసు పెట్టకుండా ఏం చేస్తోందని ప్రశ్నించారు. వంద మంది నగరంలో దాడులకు కుట్ర చేసినట్లు తెలుస్తోందని.. రాష్ట్ర ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని నిలదీశారు. ‘దేవాలయాల మీద దాడి మా తల్లి మీద దాడిలా భావిస్తాం... తిప్పికొడతాం‘ అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం బీజేపీ బృందం డీజీపీ ఆఫీసుకు బయలుదేరింది. గవర్నర్ కార్యాలయం నుంచి డీజీపీ ఆఫీస్‌కు ఒకే కారులో ఎంపీలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు వెళ్లారు. ఈ సందర్భంగా నేతలున్న కారును ఎంపీ రఘునందన్ రావు స్వయంగా నడిపారు. కాసేపటికే డీజీపీ కార్యాలయానికి చేరుకున్న తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల బృందం.. డీజీపీ జితేందర్‌ను కలిశారు. ముత్యాలమ్మ గుడి ఇష్యూ, హిందూ సంఘాల లాఠీఛార్జ్ అక్రమ కేసులపై ఫిర్యాదు చేశారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ట మార్కెట్లు

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు తీవ్ర ఊగిసలాటకు లోనయి చివరికి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలతో నేటి ట్రేడింగ్ ఉత్సాహంగా ప్రారంభమయినప్పటికీ చివరికి నష్టాల్లో ముగిసింది. ఎన్ఎస్ఈలో బజాజ్ ఆటో, హెచ్ డిఎఫ్ సి బ్యాంక్, ఏసియన్ పెయింట్, ఎం అండ్ ఎం, ఐషర్ మోటర్స్ షేర్లు ప్రధానంగా లాభపడగా, టాటా కన్జూమర్, కొటక్ బ్యాంక్, బజాజ్ ఫిన్సర్వ్, బిపిసిఎల్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. నేడు సెన్సెక్స్ 73.48 పాయింట్లు లేక 0.09 శాతం నష్టపోయి 81151.27 వద్ద ముగిసింది, ఇక నిఫ్టీ 72.96 పాయింట్లు లేక 0.29 శాతం నష్టపోయి 24781.10 వద్ద ముగిసింది. ఇక 2902 స్టాకులు ట్రేడవ్వగా, 695 లాభపడ్డాయి, 2120 నష్టపోయాయి, 87 మార్పు లేకుండా ముగిశాయి.

# మహిళా అభ్యున్నతికి పాటుపడటమే మన ప్రభుత్వ లక్ష్యం..

## పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు





**సుల్తానాబాద్, అక్టోబర్ 21( ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మండల ప్రజా పరిషత్ కాంప్లెక్స్ లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను సోమవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు వంటి పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళ గ్రామ సంఘాలు లాభాల బాటలో పయనిస్తాయని, తద్వారా ఆయా సంఘాల సభ్యులకు మేలు జరుగుతుందన్నారు. ఐకేపీ ద్వారా విరివిగా మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. గత 10 సంవత్సరాల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిచ్చిందన్నారు. మహిళా సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. పేదల, మహిళల పక్షపాతిగా సీఎం రేవంత్ రెడ్డి మహిళల కోసం మరిన్ని పథకాలు తీసుకురావడానికి ఆలోచనలు చేస్తున్నారని చెప్పారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతి గ్రామంలో దాదాపు 70 శాతం మంది రైతులకు పైగా రుణమాఫీ జరిగిందన్నారు. మిగతా వారికి మరో నెల రోజుల్లో మాఫీ ప్రక్రియ పూర్తి అవుతుందని ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలు సెంటర్లలో వడ్ల కటింగ్ తో రైతులు దారుణంగా మోసపోయి నష్టపోయారని చెప్పారు. అలాంటి పరిస్థితి లేకుండా తాను ఎమ్మెల్యే అయినప్పటి నుండి రైతులకు ఎంతో మేలు చేస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్టు తెలిపారు. పేదల కే ప్రాధాన్యత ఇచ్చి ఇల్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి అవినీతి జరిగినా సహించేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే ఇన్ని సంక్షేమ పథకాలు చేపట్టినప్పటికీ, పదేళ్లపాటు అవినీతిలో కూరుకుపోయి ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ పార్టీ నేతలు సిగ్గు లేకుండా ధర్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే గారు మండిపడ్డారు. ప్రజల్లో ఆ పార్టీ ఉనికి లేకుండా పోతున్న క్రమంలో అబద్దాలను ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, పట్టణ కౌన్సిలర్లు,ఐకెపి బిపిఎం రజని, ఏపీఎం లు శ్రీనివాస్, గీత,మినుపల ప్రకాష్ రావు,సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ చిలుక సతీష్ ,మండల సమైక్య అధ్యక్షురాల్లు కళ్యాణి, శారద, కౌన్సిలర్లు, తొగర్రాయి గ్రామ ప్రగతి మహిళా సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ యోజానలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలి

**- జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో విశ్వకర్మ యోజానలో జరుగుతున్న అవకతవకలపై సోమవారం బిజెపి మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్,పట్టణ అధ్యక్షులు కావేటి రాజగోపాల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఆనంతరం బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతివృత్తులను నమ్ముకొని పనిచేసుకొనే చేతి వృత్తిదారులకు సెప్టెంబర్ 17, 2023 రోజున ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆర్థిక చేయూతను ఇచ్చేందుకు తక్కువ వడ్డీతో మొదటి విడతలో ఒక లక్ష, ఆ తర్వాత రెండు లక్షల రూపాయలు ఇచ్చే విధంగా విశ్వకర్మ యోజన పథకమును తీసుకురావడం జరిగిందని,ఈ స్కీమును అన్ని రాష్ట్రాలలో ఇంప్లిమెంటేషన్ చేయడం జరిగిందని, కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వలన ,బ్యాంక్ మేనేజర్ల అతి ఉత్సాహం కారణంగా విశ్వకర్మ యోజన అప్లికేషన్ దారులు ఇబ్బందులు పడడం జరుగుతుందని అన్నారు. ఈ విశ్వకర్మ పథకముకు సిబిల్ స్కోర్ అవసరం లేకున్నా సిబిల్ స్కోర్ ఉన్నవాళ్లకే లోన్ ఇస్తామని బ్యాంక్ మేనేజర్లు లబ్ధి పొందవలసిన వారిని ఇబ్బంది పెడుతున్నారని, అనేకమంది ట్రైనింగ్ పొందినప్పటికీ వారికి ఇంకా వారి ట్రైనింగ్ డబ్బు పడలేదన్నారు. కొందరికి కొంత అమౌంట్ వారి అకౌంట్లో వేసి ఆ ఎమౌంటును ఫ్రిజులో పెట్టడం జరిగినదని, కావున పెద్దపల్లి జిల్లాలో విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు తగు న్యాయం చేయాలని బిజెపి ఆధ్వర్యంలో విన్నవించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతలు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, ఓల్లే తిరుపతి, ఈర్ల శంకర్, కల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు సిలివేరి సంపత్ ఉమేష్ సతీష్, లబ్దిదారులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరులకు టూ - టౌన్ పోలీసుల నివాళులు



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోదావరిఖని రెండవ పట్టణ పోలీసులు సోమవారం పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. ఉదయం పట్టణ సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఎన్.ప్రసాద్ రావు ఆద్వర్యంలో పోలీసులు స్టేషన్ కు దగ్గర్లోని అమర పోలీసుల సమాదివద్ద వారి ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకుని నివాళులు అర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్టేషన్ సబ్ ఇన్స్ పెక్టర్ ఎండి.హైమదుల్ల, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి సెంటర్లు పిఎసిఎస్ సెంటర్లు ప్రారంభం కాకపోవడం బాధాకరం

**- బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు మట్ల దినేష్ డిమాండ్**



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని వ్యవసాయ మార్కెట్లోకి రైతులు పండించిన వరి ధాన్యం వచ్చి చేరుతున్న ఐకెపి సెంటర్లు పిఎసిఎస్ సెంటర్లు ప్రారంభం కాకపోవడం చాలా బాధాకరం బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ సమయాన్ని కల్లా వడ్లు కొనుగోలు చేసేవారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక రైతులను అనేక రకాలుగా రైతు రుణమాఫీ గాని రైతుబంధు గాని అవి ఏవీ చేయకుండా రైతులను చాలా ఇబ్బంది పేడుతున్నారు ఉన్నత అధికారులు దీనిపై వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు సెంటర్లను త్వరగా ఓపెన్ చేసి ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు మట్ల దినేష్ డిమాండ్ చేశారు.

# ఒక్క ఫోన్ కాల్‌తో పశు వైద్య సేవలు

**- వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివ కుమార్**





**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్):** అనారోగ్యంతో ఉన్న మూగ జీవాల వైద్య సేవల కోసం తెలంగాణ ప్రభుత్వం 1962 పశు సంచార వాహన సేవలను ప్రతిష్ఠత్మకంగా ప్రవేశపెట్టింది. ఈ సంచార వాహనాలు గ్రామాల్లో పాడి రైతుల మన్ననలు పొందుతూ విరామమెరుగని సేవలు అందిస్తున్నాయి. ఒక్క ఫోన్ కాల్ తో పశు వైద్య సిబ్బంది రైతుల వద్దకు చేరి మూగ జీవాలకు చికిత్స అందిస్తున్నారు. వరంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్క ఫోన్ కాల్ తో 1962 సంచార వాహన సేవలను క్షేత్ర స్థాయిలో అందిస్తున్నారు. ప్రసవ వేదనతో, అనారోగ్యంతో బాధపడుతున్న, ప్రమాదాలలో గాయపడిన మూగ జీవులకు వరంగల్ 1962 సిబ్బంది తక్షణమే స్పందించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఇటీవల ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామంలో రాకేష్ అనే పాడి రైతు 1962 కి ఫోన్ చేసాడు. తన గేదేకు గర్భసంచి బయటకు వచ్చిందని తెలిపారు. విషయం తెలుసుకున్న పశు వైద్యులు డా.ఉదయ్, పారవేట్ రోజా, కెప్టెన్ రాజు, హెల్పర్ మల్లయ్య సదరు రైతు ఇంటికి చేరుకుని చికిత్స చేశారు. తక్షణమే స్పందించి మెరుగైన వైద్య సేవలు అందిచిన 1962 సిబ్బందిని రైతు, గ్రామస్తులు ప్రశంసించారు. పాడి రైతులు 1962 టోల్ ఫ్రీ నెంబర్ కు ఒక్క ఫోన్ కాల్ చేస్తే పశు వైద్య సిబ్బంది తమ ఇంటి వద్దకే వచ్చి పశువులకు వైద్య పరీక్షలు చేసి చికిత్స అందిస్తారు. పాడి రైతులు 1962 సేవలను వినియోగించుకోవాలి.

# చిన్నకల్వల గ్రామములో న్యాయ విజ్ఞాన సదస్సు



**సుల్తానాబాద్, అక్టోబర్ 21( ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మండల న్యాయ సేవాదికారా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చిన్నకల్వల గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ మాట్లాడుతూ ప్రతి మారుమూల గ్రామ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందాలని, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు కు సంబంధించి సుల్తానాబాద్ కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ను సంప్రదించినట్లయితే తగు న్యాయ సహాయం అందిస్తామని అన్నారు. వరకట్నానికి అరికట్టాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ దూడం ఆంజనేయులు, లోక్ అదాలత్ సభ్యులు ఆలూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎరుకొండ రమేష్, గ్రామ కార్యదర్శి రణధీర్ లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## శివకృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

# ఉచిత వైద్య శిబిరం




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి రైల్వే హమాలీస్ కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు నాలుగవ వార్డు కౌన్సిలర్ స్వర్గీయ కొంతం శ్రీనివాసరెడ్డి గారి స్మారకార్థం సోమవారం పెద్దపల్లి రైల్వే స్టేషన్ ఆవరణలోని హమాలి గుడ్ షెడ్ కార్యాలయంలో కరీంనగర్ శివ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో గుడ్ షెడ్ లోడింగ్ అన్లోడింగ్ హమాలి కార్మికులకు బిపి, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కంది మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డ్రగ్స్, గుట్కా, మద్యపానం తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. బరువులు బస్తాలు మోస్తున్న హమాలీ కార్మికుల కోసం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పెద్దపల్లి రైల్వే హమాలి కోఆపరేటివ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జంగా సంపత్, డైరెక్టర్లు, పెద్దమనుషులు, శివకృష్ణ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శివకృష్ణ ఆసుపత్రి వైద్యులు సిబ్బంది, రైల్వే హమాలీ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్లు సిహెచ్ మోహన్, సిహెచ్ శ్రీశైలం పాలేటి వెంకటేష్, దాగేటి రవి, పెద్దమనుషులు తోకల సతీష్ దాగటి రమేష్, తోకల వెంకటేష్, పోసాని రమేష్, బూరం భాను, బత్తుల శ్రీకాంత్, శ్రీరాముల ప్రశాంత్, సలేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# అద్వితీయ భరితంగా అభిమాన నాయకుని జన్మదిన వేడుకలు....





**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** ఈరోజు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందిన హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు- సభ్యులు, కార్మిక నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు, అభిమానులు "జై వివేకన్న" నినాదాల మధ్య భారీ కేక్ కటింగ్, పుష్పగుచ్చాలనందిస్తూ శాలువాలు కప్పి అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నూతన పాలకేంద్రాలే టార్గెట్‌గా ఘరానా మోసాలకు తెరతీసిన కృష్ణారావు..



**జమ్మికుంట అక్టోబర్ 21 (ది క్రైమ్ న్యూస్):** నూతనంగా ఏర్పాటు చేసే పాల కేంద్రాలను టార్గెట్ చేసుకొని కోట్ల కోట్లు దండుకొని పరారైన ఏరంశెట్టి. కృష్ణ రావు వివరాల్లోకి వెళితే జమ్మికుంట మండల పరిధిలోని నూతనంగా ఏర్పాటైన పాల కేంద్రంలో మేనేజర్ గా జాయిన్ అయినా కృష్ణారావు దాని పూర్తి బాధ్యతలు నిర్వహిస్తూ యజమానియానికి తెలియకుండా కోట్ల రూపాయలు దండుకున్నా ఘటన వెలుగులోకి వచ్చింది. సదరు యజమాని నూతనంగా ఏర్పాటు చేసిన పాల కేంద్రంలో లాభాలు లేకున్నా కానీ కోట్లలో నష్టం ఎలా వస్తుందా అని ఆరా తీస్తే ఘరానా మోసం బయటపడింది. కృష్ణారావును యజమాని నిలదీస్తే మీ పాల కేంద్రంలో పనిచేయని చెప్పి పరారై వెళ్లిపోయాడు. యజమాని పాల కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారా పాల కేంద్రానికి పాల దిగుమతి కాకుండానే దిగుమతి చేసుకున్నట్లు రికార్డుల సృష్టించి సుమారు మూడు కోట్ల 20 లక్షల రూపాయలను కృష్ణారావు కాజేశాడు. రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించిన యజమాని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేశారన్న విషయం తెలుసుకున్న కృష్ణారావు కొంతమంది మధ్యవర్తులతో యజమానికి సమాచారం అందించి మాట్లాడుకుందాం కేసులు వద్దని యజమాని దగ్గరికి వచ్చి ఇది మొదటి తప్పుగా భావించి నేను ఏవైతే తప్పుడు రికార్డు సృష్టించి మూడు కోట్ల రూపాయలు కాజేశాను వాటిని మీకు ఇస్తాను అని మధ్యవర్తులతో ఒప్పంద పత్రాలు వ్రాయించి ఇచ్చాడు. యజమాని అనేక వ్యాపార రంగాలు ఉన్న సందర్భంగా ఒక వ్యక్తిని నమ్మి సంస్థను అప్పజెప్పి పోతే ఈ విధంగా మోసం చేయడాని జీవించుకోలేకపోతున్న యజమాని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఉండాలంటే కృష్ణారావు లాంటి వారితో వ్యాపారం చేస్తే వ్యాపారవేత్తలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పత్రికలకు తెలిపారు.

# సంపాదకీయం

## రాజకీయ పబ్బం కోసం విమర్శలు !

తెలంగాణ, ఆంధ్రాలో విపక్షంలో ఉన్న బిఆర్‌ఎస్, వైకాపాలు తమది ..ఒక్కటే రాగం అన్న చందంగా విమర్శలతో కాలం గడుపుతున్నారు. అప్పుడే కొంపలు అంటుకు పోయాయని, తాము ఉంటే అంటుకునేవి కావన్న రీతిలో గగ్గోలు పెడుతున్నారు. విమర్శలకు హద్దులు ఉండవన్న రీతిలో రెండు పార్టీల నేతలు రోజూ ఏదో ఒక అంశం తీసుకుని పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఎంతగా అంటే ఒకరోజు మీడియాతో మాట్లాడడం, మరుసటి రోజు దానినే ట్విట్టర్ ద్వారా వల్లించడం, తరవాతి రోజు దానిపై సొంత పత్రికల్లో కథనాలు రాయించడం అలవాటు చేసుకున్నారు. నవ్విపోదురు గాక నాకేంటన్న చందంగా ..గత పాపాలను ప్రజలు మరచి పోవాలన్న ఏకైక లక్ష్యంతో జంకూగొంకూ లేకుండా విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్, హరీష్ రావులు ఈ అబద్దాల ప్రచారంలో ఆరితేరారు. అధికారంలో ఉన్నప్పుడు వివిధ మార్గాల్లో సొంత ఆదాయం పెంచుకున్న వీరు ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న చంద్రబాబు ను, రేవంత్‌ను అడ్డగోలుగా దోచుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. అధికారమంటే దోచుకోవడమే అన్న చందంగా ఐదేళ్లు జగన్, పదేళ్లు బిఆర్‌ఎస్ నేతలు దోచుకున్నది ప్రజలు మరచి పోలేదు. ప్రభుత్వ వనరులను,ఖజానాను కొల్లగొట్టి తమ సొంత వనరులు సమకూర్చుకున్న నేతలుగా చరిత్రలో వీరు నిలిచి పోయారు. అసలు ఎపి విభజన జరిగిందే వీరి ఆదాయాలు పెంచడానికి అన్న చందంగా రాష్ట్రాల తీరు మారింది. అప్పులతో కుదేలు చేశారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకుని వచ్చారు. ఎపిలో లిక్కర్ పాలసీతో నాసిరకం మద్యం సరఫరా చేసిన జగన్ అడ్డంగా దోచుకున్నారు. నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తూ..గతమంతా బంగారు మయం చేశామని ఈ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసిన వైకాపా, బిఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు ప్రజలపై వల్లమాలిన ప్రేమను ఒలకబోస్తున్నారు. జర్నలిస్టులంటే అయ్యో అంటూ రాగాలు తీస్తున్నారు. ప్రజలను ఛీదరించుకునే స్థాయికి దిగజార్చి, వారిని కనీసం దరిచేరకుండా పాలన చేసి, సిఎం కలవాల్సిన అవసర మేముందని దబాయింపు మటలు మాట్లాడిని నేతలు ఇప్పుడు ప్రజలపై ఎక్కడ లేని ప్రేమను ఒలక బోస్తున్నారు. మల్లన్నసాగర్‌లో ప్రజల జీవితాను ముంచేసిన కెసిఆర్ బృందం ఇప్పుడు మూసీ మురికి బాధితుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారు. దోచుకోవడమే పాలన అన్నచందంగా సాగిన వీరి ఆగడాలను భరించలేకే ప్రజలు అధికారం నుంచి దించేశారు.  సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పందేరాలు సాగించి, అదే అభివృద్ధి అని నమ్మించి ఎన్నికల్లో ఓటమి పాలైనా వీరికి జ్ఞానోదయం కలగడం లేదు. ఆనాడు దూరం పెట్టిన ప్రజలపై ఇప్పుడు ఎక్కడలేని మమకారం పుట్టుకొస్తోంది. ఓటమి ఎందుకు ఎదురైందో తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం ఆత్మవంచన చేసుకోవడం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధంగా లేని నేతలు.. ముఖ్యమంత్రిగా మాత్రమే ఉండాలనుకుంటున్న నేతలను ప్రజలు సమయం చూసి వాతలు పెట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. అలాగే అసెంబ్లీకి రాని, ప్రజల సమస్యలను పట్టించుకోని ఫామ్‌హౌజ్ కే పరిమితమైన కెసిఆర్ విపక్షనేతగా ఉండాలా అన్నది కూడా ప్రజలు ఆలోచించాలి. ఇలాంటి వారిలో పరివర్తన వస్తుందని, రావాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఇది చాలదన్నట్లు ఇప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగితే తమదే అధికారం అని బిఆర్‌ఎస్ తమ బాకా పత్రికలో కథనాలు రాయించు కుంటోంది. తెలంగాణలోమూసీ మురికి వదలకూడదు. అక్రమంగా రైతుబంధును  అమలు చేసిన తీరును అడ్డుకోరాదు. అక్రమంగా బతుకమ్మ చీరల పేరుతో జరిగిన  అన్యాయాలను నిలదీయరాదు. నిరుద్యోగులకు టోపీ పెట్టిన వైనాన్ని నిలదీయరాదు. మిష్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ధరణి అవినీతుల గురించి మాట్లారాదు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరగాలని ఆకాక్షించి గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తే వాటిని అడ్డుకోవడం అలవాటు చేసుకున్నారు. రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ముఠాలు తయారయ్యాయి. ఇదంతా చూస్తున్న తెలుగు ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలకు తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. ప్రజలను కలవాల్సిన అవసరం సిఎంకు ఏమిటన్న కెటిఆర్ నిజాలు గ్రహించడం లేదు.హరీష్‌రావు కూడా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. దుష్ట సంప్రదాయాలకు తలపడితే దాని పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. మీడియాపై  అక్కసు వెళ్లగక్కిన ఇరు రాష్ట్రాల పెద్దలు ఇప్పుడు మీడియాపై ప్రేమ ఒలక బోస్తున్నారు.  ఎపిలో ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కో గగ్గోలు పెట్టడం చూస్తే జాలేస్తోంది. అయితే గతంలో  అధికారం అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడి, అవినీతికి తెగించి, ఆర్థిక విధ్వంసం సృష్టించిన  వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం పెరుగుతుంది. తమకేమీ కాదులే అన్న ధీమా రాజకీయ నేతల్లో రాకూడదు. జవాబుదారీతనం తీసుకుని రావాలి. ఇకపోతే గత పదేళ్లలో తెలంగాణను దోపిడీ చేశారని, కాళేశ్వరంను ఎటిఎంలా వాడుకున్నారని గగ్గోలు పెట్టిన బిజెపి నేతలు కూడా బిఆర్‌ఎస్ నేతలతో కలసి వంతపాడడం శోచనీయం. ఇద్దరు కేంద్రమంత్రులు తెలంగాణ అభివృద్ధి గురించి కాకుండా ప్రభుత్వం కాళ్లల్లో కట్టెల్లు పెడుతున్నారు. బిఆర్‌ఎస్ నేతలకు వంత పాడేలా విమర్శల చేస్తున్నారు. నిర్మాణాత్మక పాత్ర పోషించడలో వీరు విఫలం అయ్యారు. నరేంద్రమోడీ పాలనే బ్రహ్మాండంగా ఉందని ప్రచారం చేసుకుంటే సరిపోదు. ప్రజలు ఏమనుకుంటున్నారో ఈ ఇద్దరు కేంద్రమంత్రులు తెలుసుకుంటే మంచిది. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను బిజెపి చర్చించాలి. అలా చేసే ధైర్యం ఉందా అన్నది చెప్పాలి.

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కీలక పాత్ర



**ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారు**

**విధి నిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు విడిచారు**

**అమరావతితోల శాశ్వత స్మారక స్థూపం ఏర్పాటు**

**పోలీస్ అమరులకు నివాళి అర్పించిన సిఎం చంద్రబాబు**

అమరావతి : శాంతి భద్రతల పరిరక్షణకు ఏపీ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో అమరవీరుల స్థూపానికి సీఎం చంద్రబాబు ఘన నివాళులు అర్పించారు. ముందుగా ముఖ్యమంత్రితోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, ఏపీ డీజీపీ ద్వారక తిరుమలరావు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో చాలా మంది పోలీసులు ప్రాణాలు విడిచి ప్రజల హృదయాల్లో త్యాగధనులుగా నిలిచారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్నింటికంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. 'ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఫ్యాక్షనిజం, రౌడీల ఆట కట్టించారు. శాంతిభద్రతలను కాపాడటంలో ఏమాత్రం రాజీలేదు. పోలీసుల సంక్షేమం మా ప్రభుత్వం బాధ్యత. పటిష్ఠ యంత్రాంగంగా తయారు చేయడం మా కర్తవ్యం. రాష్ట్ర విభజన తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చాం.  వాహనాలతో పాటు పరికరాలు, సాంకేతిక సౌకర్యం కల్పించాం. ఏపీ పోలీసు అంటే దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని ముందుకెళ్లాం. 2014-2019 మధ్య రూ.600 కోట్లు ఖర్చు చేశాం. కొత్తగా వాహనాల కోసం రూ.150కోట్లు వెచ్చించాం. పోలీసు కార్యాలయాల మరమ్మతులు, నిర్వహణకు రూ.60కోట్లు ఖర్చుపెట్టాం. రూ.27కోట్లతో ఏపీఎఫ్ఎస్ఎల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేశాం. పోలీసు సంక్షేమానికి రూ.55 కోట్లు కేటాయించాం. సర్వే రాళ్లపై బొమ్మలకు తగలేసి.. సీసీ కెమెరాలకు రూ.700కోట్లు ఇవ్వలేకపోయారు..సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు దీటైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం. కేంద్రం ఎప్పటికప్పుడు పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ముందుకొస్తోంది. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాం. దిశ పేరుతో వాహనాలకు రూ.16కోట్లు, కమ్యూనికేషన్ పరికరాల కోసం రూ.20కోట్లు పెండింగ్ పెడితే వాటినీ చెల్లించాం. తప్పు చేసిన వ్యక్తిని వెంటనే పట్టుకునే వ్యవస్థ అవసరం. గత ప్రభుత్వం కక్ష సాధింపులే పనిగా పెట్టుకుంది. రాగద్వేషాలకు అతీతంగా పనిచేసేదే పోలీసు వ్యవస్థ. సర్వే రాళ్లపై బొమ్మ కోసం రూ.700 కోట్లు తగలేసిన వ్యక్తి జగన్. సీసీ కెమెరాల కోసం మాత్రం రూ.700 కోట్లు ఇవ్వలేకపోయారు. నేరాల తీరు మారుతోంది.. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి' అని చంద్రబాబు సూచించారు. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు నివాళులు అర్పిస్తున్నా. శాంతిభద్రతల కోసం వారు అహర్నిశలు కృషి చేస్తున్నారు. సంఘ విద్రోహ శక్తులపై పోరాడిన ఉమేశ్ చంద్ర, వేదవ్యాస్ లాంటి పోలీసులు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. వారి స్ఫూర్తి ప్రతి పోలీసులో ఉంది. దేశానికి, రాష్ట్రానికి ఈ శాఖ చాలా కీలకం. రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తారు. పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకుంది. 24 గంటలూ పని చేసే ఏకైక శాఖ పోలీసు శాఖ. వారికి పండగలు ఉండవు, ఎప్పుడూ విధుల్లోనే ఉంటారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, దుర్గమాత ఉత్సవాలు, విజయవాడ విపత్తులో పోలీసుల పాత్ర అభినందనీయం. అమరావతిలో శాశ్వత అమరవీరుల సంస్మరణ స్థూపం ఏర్పాటు చేస్తానని అన్నారు. రాయలసీమ ఫ్యాక్షనిజం, విజయవాడ రౌడీయిజం అణచివేసిందే పోలీసులే. ఇకపై రాష్ట్రంలో జీరో క్రైమ్ నమోదు కావాలి. శాంతి, భద్రతలు మొదటి ప్రాధాన్యతగా పనిచేయాలి. ఎవరైనా నేరం చేయాలనే ఆలోచన వస్తేనే భయపడాలి. పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చాం. వారికి కావాల్సిన సదుపాయాలు అన్నీ సమకూర్చాం. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సవాళ్లను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేశాం. నేను మొదట్నుంచీ పోలీసు వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టా. సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నేరస్థులు లేటెస్ట్ టెక్నాలజీ వాడుతుంటే పోలీసులు పాత టెక్నాలజీ వాడుతున్నారు. ప్రభుత్వం పోలీస్ వ్యవస్థపై దృష్టి పెడుతోంది.

# రైతుబంధు ఎగిరిపోయింది

**రాబందుల రెక్కల చప్పుడు మిగిలింది**

**ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు**

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన నినాదం గుర్తుందా అంటూ ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు రాదని తామన్నామని, ఇప్పుడు అదే అక్షర సత్యం అయిందని విమర్శించారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్నవారు, రూ.10 వేలకే ఎగనామం పెట్టారని పేర్కొన్నారు. 'రైతుబంధు కావాలా..? రాబందు కావాలా..? ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ఇచ్చిన నినాదం గుర్తుందా..? రైతుబంధు ఎగిరిపోయింది..రాబందుల రెక్కల చప్పుడే మిగిలింది! నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టుంది పరిస్థితి..! ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఊదరగొట్టి..ఉన్న పదివేలు ఊడగొట్టారు..! పంట పెట్టుబడి ఎగ్గొట్టడం అంటే..అన్నదాత వెన్ను విరవడమే..! రైతు ద్రోహి కాంగ్రెస్..చరిత్ర నిండా అనేక రుజువులు..ఇప్పుడు ఇంకొకటి ! రైతు ద్రోహి సీఎం రేవంత్ రెడ్డిని వదిలేదే లేదు' అని కేటీఆర్ తన ఎక్స్ పోస్ట్ లో విమర్శలు గుప్పించారు. రైతు భరోసా నిబంధనలంటూ కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని బీఆర్‌ఎస్ విమర్శించింది. ఆదివారం వివిధ జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసనలు తెలిపాయి. ఈ మేరకు ఆ పార్టీ ఇవాళ ఎక్స్ లో చేసిన ఓ పోస్ట్ ను కేటీఆర్ రీపోస్ట్ చేశారు. 'రైతులకు మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. రైతులకు ద్రోహం చేసిన రేవంత్, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి.. వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. రేవంత్ సర్కారు హామీలను అమలు చేయకుండా అన్నదాతలను నయవంచనకు గురిచేసింది.  ఇప్పటికే రుణమాఫీ విషయంలో కర్షకులను వంచించిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు రైతు భరోసా విషయంలోనూ మరోసారి మోసం చేసింది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మోసాలు మరోసారి బయటపడ్డాయి. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాల్సిందే. గడచిన వానకాలం రైతుభరోసా ఇవ్వబోమంటే ఊరుకోం. సబ్ కమిటీ నివేదిక వచ్చాకే యాసంగి సాయం అందిస్తామంటే సహించబోం' అని బీఆర్‌ఎస్ అధికారిక ఎక్స్ అకౌంట్లో పోస్ట్ చేసింది.

# బ్రెజిల్ అధ్యక్షుడికి తలకు గాయం

**బ్రిక్స్ సదస్సుకు దూరం**

న్యూఢిల్లీ : బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తలకు గాయం కావడంతో బ్రిక్స్ సదస్సు కు వర్చువల్‌గా హాజరుకానున్నారు. శనివారం రాత్రి బాత్రూంలో జారిపడటంతో ఆయన తలకు గాయం అయ్యిందని అధికారులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు రష్యాలో జరగనున్న బ్రిక్స్ సదస్సు కార్యక్రమానికి ఆయన నేరుగా హాజరు కాలేకపోతున్నారని.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతారని బ్రెజిల్ అధికారిక కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.మాస్కో అధ్యక్షతన రష్యాలోని కజన్ వేదికగా ఈ నెల 22 నుంచి 24 వరకు 16వ బ్రిక్స్(బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారు. మోదీ రష్యా పర్యటన చేపట్టడం ఈ ఏడాదిలో ఇది రెండో సారి.

## దళిత యువకుడు, వాలంటీర్ దుర్గాప్రసాద్ హత్య కేసు


**పోలీసుల అదుపులో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్?**

రాజమహేంద్రవరం :  దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులోని మధురైలో అతడిని అదుపులోకి తీసుకుని అక్కడి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు సమాచారం. ట్రాన్సిట్ వారెంట్‌పై ఏపీకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. శ్రీకాంత్ అరెస్ట్‌ను రాష్ట్ర పోలీసు అధికారులు నిర్ధరించాల్సి ఉంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో రెండేళ్ల క్రితం జరిగిన దళిత యువకుడి హత్య కేసులో పినిపె శ్రీకాంత్‌ను పోలీసులు ప్రధాన నిందితుడిగా గుర్తించినట్లు సమాచారం. కోనసీమ అల్లర్ల సమయంలో అయినవిల్లికి చెందిన వాలంటీరు దుర్గాప్రసాద్‌ను 2022 జూన్ 6న హత్య చేయించినట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఉప్పలగుప్తం మండలానికి చెందిన నిందితుడు, వైకాపా సోషల్ మీడియా కన్వీనర్, మృతుడికి స్నేహితుడైన వడ్డి ధర్మేశ్‌ను పోలీసులు విచారించారు. అతడిని ఈ నెల 18న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కారులో వచ్చిన వారిలో ముగ్గురు దుర్గాప్రసాద్ మెడకు తాడు బిగించి, హత్య చేశారని నిందితుడు ధర్మేశ్ చెప్పినట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు తొలుత మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. కొన్నాళ్లకు మృతదేహం లభించడం, పోస్టుమార్టంలో హత్య చేసినట్లు నిర్ధరణ అయింది.

# తిరుమలలో 31న దీపావళి ఆస్థానం

**ఏర్పాట్లు చేస్తున్న టిటిడి అధికారులు**

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబరు 31 న దీపావళి ఆస్థానం జరగనుంది. ఏలా దదీపావళి ఆస్థానం నిర్వహించడం పరిపాటి. దీపావళి ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం నిర్వహించనుంది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటు చేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తరువాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. ఇక, దీపావళి రోజున సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. దీపావళి ఆస్థానం కారణంగా టిటిడి ఆర్జిత సేవలను రద్దు చేసింది. అక్టోబరు 31న తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను అర్చకులు ఏకాంతంగా నిర్వహిస్తారు.



ఆధ్యాత్మికం

# లక్షలమంది పేద విద్యార్థుల భవిశ్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం

### - రాస్తారోకోతో కధంతొక్కిన బిజెవైఎం నాయకులు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** లక్షలమంది విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ పార్టీ చెలగాటమాడుతోందని, ఆ పరిస్థితే వస్తే చూస్తూ ఊరుకోబోమని భారతీయ జనతా పార్టీ అనుబంద యువజన విభాగం బిజెవైెం జిల్లా ప్రధాన కార్యదర్శి శివంగారి సతీష్ తేల్చిచెప్పారు. పెండింగులో ఉన్న ఫీజు రీఎంబర్సుమెంట్, స్కాలరుషిప్పులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బస్ స్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, సంవత్సరాల తరబడి ఫీజు రీఎంబర్సుమెంటు, స్కాలరుషిప్పులు విడుదల కాకపొపవడం వల్ల రూ.7వేల5వందల కోట్లు పెండింగులో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారిందని మండిపడ్డారు. ఫీజు రీఎంబర్సుమెంటు, స్కాలరుషిప్పులు పేద విద్యార్థులకు సంజీవనితో సమానమని, వాటిని విడుదల చేయకపోవడం విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రగా ప్రభుత్వం పాటుపడుతున్నట్లు తాము భావిస్తున్నమని అన్నారు. ఫీజులు చెల్లిస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు ఫీజు రీఎంబర్సుమెంటు బకాయిలు చెల్లిస్తే తప్పా కళాశాలలు నడపలేని స్థితికు చేరుకున్నాయని వివరించారు. చిత్తశుదిలేని కాంగ్రెస్ నాయకుల పరిపాలన వలన విద్యార్థులు బలయ్యే పరిస్థితి దాపురించిందని అసహనం వ్యక్తం చేశారు. విద్యాలయాలను, విద్యావ్యవస్థను పటిష్ట పర్చాల్సిన ప్రభుత్వం విద్యను అంధకారంలోకి నెట్టి, నూతనంగా



ఇంటర్నేషనల్ పాఠశాలలు, యూనివర్సిటీలంటూ కొత్త హామీలతో చేతులు దులుపుకుంటుందని ధ్వజమెత్తారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టులేదని ఎద్దేవా చేశారు. పెండింగులో ఉన్న ఫీజు రీఎంబర్సుమెంటు, స్కాలరుషిప్పులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో బిజెవైఎం ఆద్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. రాస్తారోకోలో బిజెవైఎం రాష్ట్ర నాయకులు బెజ్జంకి దిలీప్ కుమార్, జిల్లా దళితమోర్చ ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, పర్స సమ్మయ్య, సందీప్, అక్కెపల్లి క్రాంతికుమార్, సంతోష్, విజయ్, ఫహీమ్, వరప్రసాద్, యువమోర్చా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్.ఈ.పి అమలు చేయవద్దు

### - పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి వినతి అందజేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నూతన జాతీయ విద్యా విధానం 2020ను అమలు చేయ్యవద్దని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020 అమలు చేయడం ద్వారా యూజిసి నిధులు వస్తాయని, ప్రభుత్వం ఆలోచన చేస్తుందని,నేడు దేశంలో నూతన జాతీయ విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్శిటిలను మూడు, నాలుగు. రకాలుగా విభజన చేసి విద్యను కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందని, ఈ విధానాలు ప్రభుత్వ విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని,కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆర్.ఎస్.ఎస్ నేపథ్యం ఉన్న వారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందని ఆయన అన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం నిధులు కేటాయింపులు చేయకుండా, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. నూతన విద్యావిధానం వల్ల విశ్వవిద్యాలయాల ఫండ్ కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్శిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై ఉద్యమించాలని ఆయన కోరారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపరచకుండా నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్యా లేనట్టేనని పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యులర్ పదాలను, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో బ్రిటిష్ ముస్కర్లకు తొత్తుగా



వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, హెడ్వార్గ్, వీర సావర్కర్ మొదలగు వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రను, తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బిజెపి ముందుందని ఆయన అన్నారు. విభిన్న జాతులు కలిగిన వారు భారతదేశంలో ఉన్నారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో ఒక కులాన్ని ఒక మతాన్ని ప్రోత్సహించే బిజెపి భారతదేశ చరిత్రను వక్రీకరిస్తున్నది తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసహరించుకోవాలని ఆయన హెచ్చరించారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్, గాజుల వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూపు అభ్యర్థులను బలిపీఠం ఎక్కించిన కాంగ్రెస్

### - 29జిఓను వెంటనే రద్దు చేసేవరకు పోరాటం
### - సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బిజెవైఎం నాయకులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బిసి, ఎస్సి, ఎస్టి అభ్యర్థుల పాలిట శాపంగా మారిన 29జిఓను వెంటనే రద్దుచేసి, గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయాలని భారతీయ జనతా యువమోర్చా నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం కమాన్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజెవైఎం పట్టణ అధ్యక్షుడు కృష్ణవంశీ, మండల అధ్యక్షుడు ఉమేష్ మాట్లాడుతూ, బిసి, ఎస్సీ, ఎస్టీలకు 29జిఓ వల్ల తీరని అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఆర్థికంగా బలంగా ఉన్న ఉన్నతవర్గాలకు న్యాయం చేసేవిధంగా ఉందని అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి పేదలపట్ల నిరంకుష ధోరణి పెరిగిపోయిందని, వారికి రాజ్యాంగం ప్రకారం దక్కాల్సిన హక్కులు దక్కకుండా కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైన కళ్ళుతెరిచి గ్రూప్-1 అబ్యర్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో నిరుద్యోగుల ఆగ్రహానికి బలికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షీలారపు పర్వతాలు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, పట్టణ అధ్యక్షుడు కావేటీ రాజగోపాల్, మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పు కిరణ్, ఎర్రోళ్ళ శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు గుడ్ల సతీష్, పెరిక సాగర్, వంశీ, గదాసి సతీష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల అభిప్రాయం మేరకు పోరాటం

### - హెచ్.ఎం.ఎస్ నాయకులు రియాజ్



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రీజియన్ లోని ఎస్.టీ.పి.పి లో పనులు చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కొరకు చేపట్టాల్సిన పోరాటంపై హెచ్.ఎం.ఎస్ యూనియన్ సోమవారం అభిప్రాయ సేకరణ చేపట్టిందని, యూనియన్ ప్రధానకార్యదర్శి రియాజ్ హమ్మద్ తెలిపారు. ఈ మేరకు నిర్వహించిన సీక్రెట్ బ్యాలెట్ ద్వారా హక్కుల సాధనకు సమ్మె సరైన మార్గమంటూ.. 1021 మంది కార్మికులు, సమ్మె మార్గం సరైంది కాదని 09 మంది కార్మికులు తమ అభిప్రాయాలు తెలియజేసినట్లు ఆయన వెల్లడించారు. ఇక మెజార్టీ కార్మికుల అభిప్రాయం మేరకు త్వరలో పోరాట కార్యక్రమాలు చేపడతామని రియాజ్ వివరించారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు

### - ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ లాల్





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ లాల్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో పెద్దపల్లి సర్కిల్లోని 4 మండలాల పరిధిలోని దాన్యం కొనుగోలు కేంద్రాల అధికారులతో నిర్వహించిన ఖరీఫ్ 2024-25 ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. పెద్దపల్లి సర్కిల్ లోని పెద్దపల్లి, ధర్మారం, శ్రీరాంపూర్, ఓదెల మండలాలలో ఏర్పాటు చేస్తున్న 101 కొనుగోలు కేంద్రాలలో చేస్తున్న ఏర్పాటుల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ లాల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలని , కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గని బ్యాగులు ,ప్యాడ్ క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల దగ్గర పరిసరాలను శుభ్రం చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్, త్రాగు నీరు, కుర్చీలు మొదలగు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వర్షాల దృష్ట్యా అవసరమైన టార్ఫాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని అన్నారు. సన్న రకాల ధాన్యం కొనుగోలు వివరాలను టామ్ టామ్ చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు, మద్దతు ధర , రైతులు తీసుకురావాల్సిన డాక్యుమెంట్లు మొదల వివరాలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. సన్న రకం దాన్యం నాణ్యత వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ధ్రువీకరిస్తారని అన్నారు. ఏ.ఈ.ఓ టోకెన్ నెంబర్, ధాన్యం రకం వివరాలు, ధాన్యం పరిమాణం, నాణ్యత మొదలగు అంశాల సర్టిఫికెట్ పరిశీలించి కాంటా పెట్టాలని అన్నారు. కోనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వివరాలను ఆన్ లైన్ లో ఎంటర్ చేసి ట్రాక్ షీట్ జనరేట్ చేయాలని, రైతులకు 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీ మాల, పి.ఏ.సి.ఎస్. సెక్రటరీలు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు, మానిటరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులు అక్రమ కేసులను అరికట్టాలి...

### - సిరిసిల్లలో జర్నలిస్టు యూసుఫ్ పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
### - ఏడీజీపీ మహేష్ భగవత్‌కు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నేతల విజ్ఞపి



**జమ్మికుంట అక్టోబర్ 21 (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను, అక్రమ కేసుల బనాయింపును వెంటనే అరికట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడీజీపీ) మహేష్ భగవత్ ను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం,పిల్లి రాంచందర్,బండి విజయ్ కుమార్, రఘు, కార్యదర్శులు రాజశేఖర్, నవీన్,ఎస్ కే సలీమా, బిక్షపతి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి తదితరులు హైదరాబాదులో ఏడీజీపీని కలిసి వినతి పత్రం సమర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తమ యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు మహ్మద్ యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. అతనికి సంబంధం లేని ఒక కేసులో ఆయనను ఇరికించారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి అక్రమ కేసు బనాయించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టు యూసుఫ్ పై పెట్టిన కేసును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులలో మొన్న రాత్రి జర్నలిస్టు సుదర్శన్ పై దుండగులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారని, సుదర్శన్ పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో చాలా చోట్ల జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, మరోవైపు కొందరు పోలీసు అధికారులు కక్ష్యపూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు ఏడీజీపీని కోరారు.

## టిపియూఎస్ ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జంజిరాల నాగరాజు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్నటువంటి ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని, పి.ఆర్.సిని ప్రకటించాలని,పెండింగ్ బిల్లులన్నీ వెంటనే క్లియర్ చేయాలని, 317 జీవో బాధితులను వారి యొక్క సొంత జిల్లాలకు వెళ్ళే విధంగా చూడాలని, వివిధ రకాల గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమయపాలన లో మార్పు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలన్నిటిని పరిష్కరించాలని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులకు టైం స్కేల్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్ల లక్ష్మీనారాయణ , బ్రహ్మానంద రెడ్డి మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు నాడు ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలి

### - యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్



**సుల్తానాబాద్, అక్టోబర్ 21( ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణనికి చెందిన కుందారపు స్వరూప- శ్రీనివాస్ లా కూతురు.. రిషిత పుట్టినరోజు సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల పునర్వాస కేంద్రంలో మధ్యాహ్నాం భోజనం పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్ మాట్లాడుతూ పుట్టినరోజు అంటే అంగులు ఆడంబరాలు చేయకుండా ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలని అలాగే పుట్టినరోజు అయితే ఏ దానం చేసినా రాని పుణ్యం కేవలం అన్నదానం చేస్తేనే వస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గోలి శ్రీనివాస్. సెంటర్ ఇన్చార్జి బండపల్లి శ్రీనివాస్.. సరూప. ఆయమ్మ , సిబ్బంది పాల్గొన్నారు..

## రఘు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటాం

### - రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క




**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** ఏటూర్ నాగారం మండలం షాపెల్లి గ్రామం కాంగ్రెస్ నాయకులు ముద్రబోయిన రఘు ఇటీవలఅనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారంఆయన దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారికుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ కార్యకర్తలను ఎల్లవేళలా కంటికి రెప్పలాకాపాడుకుంటామనితెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- పోలీసు కమీషనరేట్ కేంద్రంలో ఫ్లాగ్ డే నిర్వహణ
- పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది
- కరీంనగర్ పోలీసు కమీషనర్ అభిషేక్ మొహంతి





**కరీంనగర్ టౌన్, అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):** పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని, పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సోమవారంనాడు ఫ్లాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి హాజరయ్యారు. అమరవీరుల విగ్రహానికి కరీంనగర్ సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం దేశవ్యాప్తంగా అమరులైన పోలీసులను స్మరించుకున్నారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ తో పాటు ఇతర పోలీసు అధికారులు అమరవీరుల కుటుంబ సభ్యులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి హాజరైనవారంతా పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి మీడియాతో మాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా దేశ రక్షణకోసం, సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులను ఫ్లాగ్ డే సందర్భంగా స్మరించుకుని నివాళులు అర్పించామన్నారు. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా పారా మిలిటరీ రాష్ట్ర పోలీసులు అమరులయ్యారన్నారు. వారి త్యాగాలు ఎప్పటికీ వృధా కావన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు ప్రశాంతంగా ఉండేలా, శాంతి భద్రతలు కాపాడే విధంగా విధులు నిర్వహిస్తామన్నారు. అమరుల కుటుంబ సభ్యులతో పోలీస్ కమీషనర్ మాట్లాడి వారి సేవలను కొనియాడారు. వారికి గల సమస్యలను తెలుసుకున్నారు. అట్టి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# గ్రూప్-01 పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ఏర్పాట్లు

**- మేడ్చల్, మల్కాజి గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా**







**కూకట్ పల్లి, అక్టోబర్ 21, (ది క్రైమ్ న్యూస్):** గ్రూప్ -1 పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తా అన్నారు. సోమవారం నుండి ప్రారంభమైన గ్రూప్ -1 పరీక్షల నిర్వహణలో భాగంగా కూకట్ పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజి, బాచుపల్లిలోని విఎన్ఆర్ ఇంజనీరింగ్, చింతల్ లోని రెయిన్ బో డిగ్రీ కాలేజీ, దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఏర్పాట్లను తనిఖీ చేసి పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని చర్యలు పూర్తి చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తా తెలిపారు. ప్రతి పరిక్షా కేంద్రం వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసారన్నారు. పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తూ పరీక్షా కేంద్రాలలో తిరిగి పరీక్ష గదులను, సిసి కెమెరాల డిజిటల్ వాచ్ ల ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులైన దివ్యాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేసామన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ షాపులను మూసి ఉంచారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు కేటాయించిన సిబ్బంది ఫోన్లను కూడా పరీక్ష గదులలోనికి అనుమంతించకూడదని స్పష్టం చేసారు. తనిఖీలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలలో 17,762 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, 1.30 గంటల లోపే అభ్యర్థులను అనుమతిస్తారని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు అదనపు కలెక్టరు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

# పోలీసు అమరవీరులకు నివాళులు



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కాలనీలోఈ.వి.ఎస్.ఎన్.జి.ఓ.ఎస్ సంస్థ వారు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ చైర్మన్ ఇరికి మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 35 మంది యువకులు రక్తదానం చేశారు. ఇక ఈ సందర్భంగా సమాజంలో పోలీస్ పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మందల కిషన్ రెడ్డి, పలు రాజకీయ పార్టీల నాయకులు గుండేటీ రాజేష్, చిన్నమారేల్లి రాజిరెడ్డి, యాదగిరి తిరుపతి, దేవనపల్లి చక్ర పాణి, ఆకుల శశీకుమార్, మల్లారెడ్డి తిరుపతి రెడ్డి, అనుమ రాములు, ఇరికి రాజేశ్వరి, తదితరులు పాల్గొని పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు.

# మూలపోర్టు పనులు ప్రారంభించిన మంత్రి అచ్చన్న



**శ్రీకాకుళం,అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):** మూలపేట పోర్టు నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు సోమవారం పున: ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 2025 జూన్ 12 నాటికి పోర్టు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికి పోర్టు ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాను పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మూలపేట పోర్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా నుంచి ఎగుమతి అవకాశాలు వృద్ధి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వలసలను నివారించి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# ఆహార పట్టిక ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**- ముత్తారం ఎంపిడిఓ సురేష్**





**ముత్తారం.అక్టోబర్.21.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఎంపీడీవో సురేష్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.రిజిస్టర్లను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు.భోజనం తయారు చేసే వంట గదిని పరిశీలించి,విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు, నాణ్యమైన విద్య,మంచి భోజనం అందిస్తుందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదువుకొని బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

# నేటికీ అందని వరదసాయం

## నిర్లక్ష్యంగా ప్రభుత్వం తీరు
## సిపిఐ ఆధ్వర్యంలో బాధితుల ఆందోళన

**విజయవాడ,అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):** కృష్ణా నది వరదల వలన నష్టపోయిన వేల కుటుంబాలకు ఇప్పటికీ ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారం అందలేదని బాధితులు వాపోయారు. విజయవాడ 17, 18, 20, 21 డివిజన్‌లలోని రాణీగారితోట, కృష్ణలంక పరిధిలోని తారకరామానగర్, భూపేష్‌గుప్తా నగర్, గీతానగర్, రణదివేనగర్ ప్రాంతాల్లో బాధితులు ఆందోళనకు దిగారు. ఈ విషయమై విజయవాడలోని సెంట్రల్ యం.ఆర్.ఓ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ రిటైనింగ్‌వాల్ నిర్మాణం జరిగినా ఈ ప్రాంతంలోని కుటుంబాల్లో వరద వలన విషాదం మిగిలిందన్నారు. కట్టు బట్టలతో రోడ్లపైకి చేరి, పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చిందని చెప్పారు. సుమారు 5 రోజులు వరద నీటిలో ఈ ప్రాంత ప్రజల ఇండ్లు మునిగి ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరదల్లో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని, ఆఖరి కుటుంబానికి నష్టపరిహారం అందిచేంత వరకు కఋషి చేస్తామని చెప్పారనీ? కానీ ఈ ప్రాంతాల్లో సగానికి పైగా బాధితులకు పరిహారం అందలేదు అని తెలిపారు. ఇప్పటికే అనేక పర్యాయాలు అధికారులకు, సచివాలయాల్లో అర్జీలు పెట్టుకుని ఉన్నారని, అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ వారికి ఇప్పటికీ న్యాయం జరగలేదు అని వివరించారు. నెలలు గడుస్తున్నా బాధితులకు పరిహారం అందకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో అనేక లోపాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా తోపుడు బండ్లు, కిరాణా షాపులు, చిరు వ్యాపారులకు, వాహనాలకు నష్టపరిహారం అందాల్సి ఉందని చెప్పారు. అనేక మంది దాతలు ఉదారంగా బాధితుల కోసం ప్రభత్వానికి వందల కోట్లు డబ్బు అందించారు అని, ప్రభుత్వం ప్రచార ఆర్భాట కార్యక్రమాలే తప్ప ప్రజలకు, బాధితులకు అండగా నిలిచి బాధితులందరినీ ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు అని అసహనాన్ని వ్యక్తం చేశారు. రెండు నెలలైనా పరిహారం అందని వారికి ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు.10 రోజులకు పైగా వరదల వలన పనులు నష్టపోయారనీ, ఇప్పుడు ప్రభుత్వ నష్టపరిహారం కోసం పనులు మానుకుని తిరుగుతున్నారు అని తెలిపారు. బ్యాంక్ లింక్, ఆధార ఈకెవైసి, మ్యాపింగ్ వంటి సాకులు చూపించి బాధితులకు పరిహారం అందించకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు. సగంమందికి పైగా ఆశతో ప్రభుత్వం తమను ఆదుకుంటుందని ఎదురుచూస్తున్నారు? కానీ ప్రభుత్వం వారు నిర్ణయించు కున్న వారికే పరిహారం అందిస్తున్నారు తప్ప బాధితుల గోడు వినడం లేదు అని ధ్వజమెత్తారు. క్షేత్రస్థాయిలో సర్వే జరిపి పరిహారం అందని వారికి కచ్చితంగా అందించేలా చూడాలని కోరారు. ఇప్పటి వరకు గుర్తించిన లబ్దిదారులలో ఎంతమందికి పరిహారం అందించారు ? ఇంకెంతమందికి అందించాలి ? పూర్తి స్థాయి సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి అని కోరారు. ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులకు సరైన రీతిలో స్పందించి వారికి ఎందుకు పరిహారం అందలేదో తెలిపి తక్షణమే వారికి వరద పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆటోల రిపేర్లకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. సుమారు 50 వేల రూపాయలు రిపేర్లకు ఖర్చు అవుతున్నదని తెలిపారు. వాహన దారులకు ఇచ్చే పరిహారం పెంచాలన్నారు. ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందనివారికి పరిహారం అందించేందుకు అవసరమైతే మళ్లీ రీ సర్వే చేయించాలన్నారు. అర్హులైన అనేక కుటుంబాలకు పరిహారం అందించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సెంట్రల్ డిప్యూటీ తహసీల్దార్ కి వినతిపత్రం, బాధితుల అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ, నగర నాయకులు, టి.చంద్రశేఖర్, కోరాడ రమణ, ఎన్.నాగేశ్వరరావు, వై.కృష్ణ, కోటి రెడ్డి, ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

## న్యాయం కోసం లక్షల మంది బాధితుల ఎదురుచూపు - బాధితుల సంఘం గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు

**విజయవాడ,అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):** అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు కోరారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షల మంది బాధితులు ఇంకా న్యాయం కోసం తిరుగుతున్నారన్నారు. దశాబ్ద కాలంగా బాధితులు పోరాటం చేస్తూనే ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వం రూ.906 కోట్లు ఇచ్చి మమ అనిపించి... మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బాధితులను మోసం చేసింది కాబట్టే ఓడిపోయిందన్నారు. పిలవని పేరంటానికి అన్నట్లుగా జగన్ వచ్చి ఆనాడు నేను ఆదుకుంటానని, ఆరు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారని.. ఐదేళ్లు పాలన సాగించిన జగన్.. అగ్రిగోల్డ్ బాధితుల గోడు ఆలకించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం అర్జీ తీసుకునేందుకు కూడా జగన్ సమయం ఇవ్వలేదన్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలను నమ్మి 36 లక్షల మంది బాధితులు ఓట్లు వేశారన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి బాధితులను ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చామన్నారు. ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, సమర్ధ అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మేసుకుంటున్నారని.. వాటిని ప్రభుత్వ ఆధీనంలో ఉంచి ఆస్తులను ఆక్షన్ పెట్టాలని వినతి చేశారు. బాధితులకు ఇవ్వగా, ఇంకా అదనంగా కూడా డబ్బులు వస్తాయని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. చనిపోయిన బాధితుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈనెల 28వ తేదీన ధర్నా చౌక్‌లో బాధితులతో కలిసి మహా విజ్ఞాపన దీక్ష చేపడుతున్నామని ముప్పాళ్ల నాగేశ్వరరావు వెల్లడించారు. కాగా... అగ్రిగోల్డ్ మోసాల వల్ల ఉమ్మడి ఏపీలో దాదాపు 11 వేల మంది డిపాజిటర్లు మునిగిపోయిన విషయం తెలిసిందే. పిల్లల ఉన్నత చదువులు, అమ్మాయి పెళ్లి, పదవీ విరమణ అనంతర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువగా మధ్యతరగతి ప్రజలు డిపాజిట్లు కట్టారు. వారందరినీ అగ్రిగోల్డ్ సంస్థ ముంచేసింది. డిపాజిటర్లకు న్యాయం చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ తర్వాత వారికే శఠగోపం పెట్టాలని చూశారు. వారికి ఉన్న చట్ట రక్షణలను తొలగించాలని కుట్ర చేశారు. అమ్మి డిపాజిటర్లకు చెల్లింపులు చేయాల్సిన అగ్రిగోల్డ్ ఆస్తులను తాకట్టు పెట్టాలని చూశారు. దీనికోసం ఆర్డినెన్స్‌ను కూడా సిద్ధం చేశారు. అయితే, అప్పటి గవర్నర్ జోక్యంతో జగన్ ఎత్తు చిత్తయింది. 2019 ఎన్నికలకు ముందు అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేస్తానని జగన్ ఆర్భాటం చేశారు. గ్రిగోల్డ్ బాధితులకు తాను అధికారంలోకి వస్తే రూ.1100 కోట్లు కేటాయిస్తానని మాటిచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట దేవుడెరుగు.. అగ్రిగోల్డ్ ఆస్తులపైనే గురిపెట్టారు. అగ్రిగోల్డ్ సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.4500 కోట్లు విలువైన స్థిర, చరాస్థులున్నాయి. వీటిని గత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే గత ఐదేళ్లల్లో కేవలం రూ.5వేలు, రూ.10 వేలు కట్టిన డిపాజిటర్లకు మాత్రమే జగన్ ప్రభుత్వం చెల్లింపులు చేసింది. రూ.10 వేలు పైన కట్టిన డిపాజిటర్లకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. మొత్తం అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించాల్సింది ఆరువేల కోట్లు కాగా, ప్రభుత్వం రూ.900కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇప్పటికీ రూ.5100 కోట్లు వరకూ డిపాజిటర్లకు చెల్లించాల్సి ఉంది.

# మతిస్థిమితం కోల్పోతున్న మాజీ మంత్రి కేటీఆర్

## - బిఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేసే ముందు ఆలోచించాలి - బిఆర్ఎస్ దుష్ప్రచారాలపై పత్రికా మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయలేదని బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు దుష్ప్రచారాలపై పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సోమవారం పత్రిక మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెన్లో ఎమ్మెల్యే విజయ రమణారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మతిస్థిమితం లేకుండా పోయిందని విమర్శించారు. రైతు రుణమాఫీ జరగలేదని, రైతుబంధు ఇవ్వలేదని కేటీఆర్ పిలుపు ఇవ్వడంతో, ఆయన తాబేదారులు అక్కడక్కడ ధర్నాలు చేశారని అన్నారు. ధర్నాలు చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని, గత పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు రైతు రుణమాఫీ చేస్తామని, మోసం చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. 2014 ఎన్నికల సమయంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని, 7 విడతల వారీగా చేయడంతో, చేసిన రుణమాఫీ వడ్డీకి కూడా సరిపోలేదన్నారు. 2018 ఎన్నికల సమయంలో, 2019లో రుణమాఫీ చేస్తామని, అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ప్రభుత్వం 2021 వరకు రుణమాఫీ ఊసే ఎత్తలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి వల్ల చేసిన రుణమాఫీ 50 శాతానికి మించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే 70 శాతం పైగా రైతులకు రుణమాఫీ చేశామని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గతంలో వారి ప్రభుత్వ హయంలో రైస్ మిల్లర్లతో కుమ్మక్కై క్వింటాలకు 10 నుండి 20 కిలోల వడ్ల కటింగ్ చేసిన బిఆర్ఎస్ నాయకులు ఏ ముఖం పెట్టుకొని రైతుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చి, మోసం చేసి, పారిపోయే పార్టీ కాదని, ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, రైతు భరోసాను అందిస్తామని, సన్న వడ్లకు ఈ సీజన్ నుండే ? 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీ అంటేనే అబద్ధాల పార్టీ అని అన్నారు. అబద్ధాలు చెప్పడం, మోసం చేయడంలో ఆ పార్టీకి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఇవ్వచ్చని అన్నారు. ఈ పత్రికా సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ చెరువులో రెండు కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

## - బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్

**కూకట్ పల్లి అక్టోబర్ 21 (ది క్రైమ్ న్యూస్):** అధికారుల పర్యవేక్షణ లేమితో అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించి పదికాలాల పాటు మన్నిక ఉండాల్సిన అభివృద్ధి పనులు అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా మూనాళ్ల ముచ్చటగా తయారవుతోందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలని డివిజన్ పరిధి లోని ఎల్లమ్మ చెరువు లో రెండు కోట్ల రూపాయలతో చేపట్టిన సివరేజ్ డైవర్షన్ లైన్ ను కుమార్ యాదవ్ స్థానికులతో కలిసి పరిశీలించి, అక్కడ పనిచేసే వారితో పాటు ఇరిగేషన్ అధికారి విశ్వంతో ఫోన్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ రెండు కోట్ల రూపాయల ప్రభుత్వ ధనంతో చేపట్టిన డ్రైనేజ్ లైన్ ప్రాజెక్టు దగ్గర సంబంధిత ఇంజనీర్ కానీ, కాంట్రాక్టర్, జిహెచ్ఎంసి అధికారులు, సివరేజ్ కి సంబంధించిన అధికారులు గాని లేకపోవడం బాధాకరం అన్నారు. ఇంజనీర్ అందుబాటులో ఉండి నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులు చేయవలసిన ప్రాజెక్ట్ కూలీలుగా ఉన్న వారే పైప్ లైన్ పనులు ఇంజనీర్ లేకుండా చేయడం దుర్మార్గం అన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే తప్ప అభివృద్ధి కార్యక్రమం కాదని అన్నారు. నామమాత్రపు పనులతో సరిపెట్టి అభివృద్ధి చేశామని గొప్పగా చెప్పుకునే ప్రజాప్రతినిధులు కూడా ఒక్కసారి ఆలోచన చెయ్యాలి అన్నారు. రెండు కోట్ల ప్రాజెక్టులో ఎవరి వాటా వారు తీసుకుని తూతూ మంత్రంగా స్పష్టత లేని డ్రైనేజ్ లైన్ పనులు చేస్తున్నారు అన్నారు. కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్ కు ఇచ్చి పనులు చేపడు తున్నప్పుడు కాంట్రాక్టర్ కు ఎందుకు ప్రాజెక్ట్ అప్పజెప్పాలో సంబంధిత అధికారులు చెప్పాలి అన్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు ఎల్లమ్మ చెరువును సుందరీకరణ చేసి కబ్జాకు గురైన ప్రాంతాన్ని కూడా కాపాడాలి అన్నారు.





# ఎం సి పి ఐ యు వ్యవస్థాపకులు అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 16వ వర్ధంతి...

**కరీంనగర్ టౌన్, అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పట్టణంలో వాగేశ్వరి డిగ్రీ కాలేజ్ లో ఎం సి పి ఐ యు వ్యవస్థాపకులు అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ ఎక్స్ ఎమ్మెల్యే 16వ వర్ధంతి సభను విజయవంతం పూర్తిచేసుకుని ఈరోజు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ సభను నిర్వహించుకోవడం జరిగింది ఈ సభలో ఓంకార్ స్ఫూర్తితో వారి ఆశయాలను అంబేద్కర్ ఆలోచన విధానం అనే అంశంపై అక్టోబర్ 17 నుంచి 31 తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సభలను జయప్రదం చేయాలని పేదల కోసం అనునిత్యం పోరాటం చేసిన మద్ది కాయల ఓంకార్ ఆశయాలను కొనసాగించాలని మద్ది కాయల ఓంకార స్ఫూర్తితో పోరాటాలు చేయాలని అనునిత్యం పేదల పక్షాన పోరాడిన నాయకుడని అసెంబ్లీ టైగర్ గా పిలిచేవారు భార్గవ కమిషన్ కృషి చేసిన నాయకులు ఉద్యమ పోర పోరాటంలో కామ్రేడ్ ఓంకార్ ఉద్యమం పోరాటాల కాలంలో నల్గొండ ఖమ్మం కరీంనగర్ వరంగల్ ముఖ్యంగా గోదారి ప్రాంతంలో పోరాటాలలో ఆదివాసులతో మమేకమై కార్మికుల కర్షకుల పట్ల నిర్వహించిన పోరాటాలు పోరాట విరమణ తర్వాత ఎంసీపీఐయు పార్టీ లకు అన్ని కమ్యూనిస్టు పార్టీలకు అన్ని కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసిన నాయకులు ఓంకార్ శాసనసభ స్థానం నర్సంపేట నుంచి ఐదుసార్లు1994 స్థానం నుండి గెలుపొంది ఇతని చరిత్ర కానీ విని ఎరుగనిది ప్రజల పక్షాన పేద ప్రజలకు నిత్యం పేదల రక్షణ పోరాటం చేసేవారు భూమి కోసం భుక్తి కోసం పోరాటాలు చేసిన నాయకులు కమ్యూనిస్టుల కోసం కమ్యూనిస్టులు ఐక్యం కావాలని పిలుపునిచ్చిన నాయకులు ఎలాంటి మత భేదాలు లేనటువంటి నాయకులు లను వర్ధంతి సభను పూర్తి చేసుకొని ఈ 16 సభల ఆధార అయినటువంటి నాయకులు గడ్డం శ్రీకాంత్ అధ్యక్షతన ఎం సి పి ఐ యు రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి మాట్లాడారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కరీంనగర్ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి జిల్లా తుమ్మల కృష్ణారెడ్డి నాయకులు సరోజన రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న దినేష్ మధు వెంకటరమణ ఏఐసీటియు జిల్లా అజీముద్దీ నాయకులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావుకు ట్రస్మా సభ్యుల మద్దతు

## - ఒక్కసారి అవకాశం కల్పించండి బానిసలా పనిచేస్తా ఎమ్మెల్సీఅభ్యర్థి యాదగిరి శేఖర్ రావు

**సుల్తానాబాద్, అక్టోబర్-21 ( ది క్రైమ్ న్యూస్):** మెదక్, కరీంనగర్, నిజామాబాద్,ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు ఓటర్ నమోదులో భాగంగా సోమవారం స్థానిక సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో సుల్తానాబాద్ పట్టణంలోని ట్రస్మా కరస్పాండెంట్ మిత్రులతో సమావేశం నిర్వహించి,పట్టభద్రులు ఓటు ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ,సుల్తానాబాద్ పట్టణంలోని గ్రాడ్యుయేట్స్ అందరిని ఓటు నమోదు చేసుకుని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 06/11/2021 పూర్వం పాసైన, ఏదైనా డిగ్రీ కలిగి ఉన్నవారు ఎన్రోల్ చేసుకోవడానికి అవకాశం ఉందని, సుల్తానాబాద్ పట్టబద్రులు ఉద్యోగాలు చేసే, ప్రైవేట్ పాఠశాలలో కళాశాలలో పనిచేసే వారు ఎన్రోల్ చేసుకోవాలని సూచించారు. మండలంలో దాదాపు పది ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, పాఠశాలల్లో పని చేసే అధ్యాపకులు, వారి పూర్వ విద్యార్థులు,ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నన్ను ఓటు వేసి గెలిపిస్తే టీచర్స్,లెక్చరర్స్ కు 10 లక్షల ఇన్సూరెన్స్ ఇప్పిస్తానని,నిరుద్యోగులకు 3000,జాబ్ కార్డ్, ఇటీవల టీఎస్ పి ఎస్ గొడవలు అన్ని విషయాల పట్ల న్యాయం చేస్తానని,కాలేజీలకు రియంబర్స్మెంట్ వచ్చేలాగా చేస్తానని సూచించారు. ప్రైవేటు ఉద్యోగుల సమస్యలే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు డాక్టర్లు అడ్వకేట్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారం కొరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. దీనిలో భాగంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేయుట,వృత్తి వికాస శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయుట, పోటీ పరీక్షలకు సన్నతమవుతున్న అభ్యర్థులకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తానని అన్నారు.ఈ సమావేశంలో ట్రస్మా సలహాదారులు ఆర్వి రమణారావు, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంకి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కేశవరెడ్డి, సెక్రటరీ బుచ్చిరెడ్డి, ఐపీఎస్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ,పట్టణ అధ్యక్షులు శ్రీధర్, సంజీవరెడ్డి, ఓదేలు, మోహన్ రాజ్, శైలజ, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.





# జివో 29 వల్ల బిసిలకు అన్యాయం


## గవర్నర్‌కు నివేదించిన ఎమ్మెల్సీ మల్లన్న

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ బీసీ సంఘాలతో కలిసి గవర్నర్ ను కలిశారు.జీవో 29పై ఫిర్యాదు చేశారు. ఈ జీవో వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో 29 ప్రకారం పరీక్షలు నిర్వహించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ పరీక్షలు ముందుకు వెళ్లేవి కాదని స్పష్టం చేశారు. దీనికి ఖచ్చితంగా అడ్డుకట్ట పడుతుందన్నారు. ఇబిసి రిజర్వేషన్లు అక్రమం అని.. గవర్నర్‌కు నివేదించామని మా నాయకడు రాహుల్ గాంధీ కులాలవారీగా జనాభాను బట్టి అవకాశాలు కల్పిస్తామని ఇప్పటికే ప్రకటించారన్నారు. ఖచ్చితంగా బీసీల రిజర్వేషన్లు, బీసీల హక్కులను కాలరాయడానికి ఎవరు ప్రయత్నించినా అది మా పార్టీ అయినా సరే వదిలి పెట్టబోమని ఆయన హెచ్చరించారు.తీన్మార్ మల్లన్న ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయన ఎప్పుడూ పార్టీ పాలసీని పట్టించుకోవడం లేదు. తన సొంత అభిప్రాయాల మేరకే రాజకీయం చేస్తున్నారు.తాజాగా జీవో 29 విషయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అంతా ప్రభుత్వ విధానాన్ని సమర్థిస్తోంది. ఈ జీవో వల్ల ఎవరికీ అన్యాయం జరగదని పైగా.. బడుగు, బలహీన వర్గాలకే మేలు అని వాదిస్తున్నారు. కానీ తీన్మార్ మల్లన్న మాత్రం .. ఈ జీవో వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని.. ఓ వర్గం వారికి ఉద్యోగాలు కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తున్నారని ఆరోపిస్తూ సొంత పార్టీ పై బీసీ సంఘాలతో కలిసి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

# ఎపి మహిళలకు చంద్రబాబు దీపావళి కానుక

## 31నుంచి ఉచిత సిలిండర్ల పంపిణీకి ఆమోదం

## ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు నిర్ణయం



**అమరావతి,అక్టోబర్21, (ది క్రైమ్ న్యూస్):** ఏపీలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీపం పథకం కింద ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందిస్తామని తెలిపారు. దీనికోసం ఏడాదికి రూ.2948 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీపం పథకం అమలు, విధివిధానాలపై ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష నిర్వమించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ.. పేదలకు మేలు చేసే సంక్షేమ పథకాల విషయంలో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి దీపావళి పథకం ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం కింద ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండి.. అన్ని అర్హతలు కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఆయా లబ్ధిదారులు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి సిలిండర్ కోసం బుకింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# సియోల్‌లో మంత్రుల బృందం పర్యటన

## చెత్త తరలింపు..విద్యుత్ ఉత్పత్తిపై పరిశీలన

## అతిపెద్ద మాపో ప్లాంట్ పనీతిరుపై అధ్యయనం

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను మంత్రుల బృందం సందర్శించింది. అలాగే అక్కడ చెత్త సేకరణ, మురికి నీటి నిర్వహణ తదితర పద్దతులను కూడా పరిశీలించింది. సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

# సింగరేణిలో గుజరాత్ కంపెనీలు

**- తగ్గుతున్న సింగరేణి కార్మికులు పెరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికులు.. - మూడవసారి నిర్వాస్తులుగా కొండాపురం ప్రజలు..**

**మణుగూరు (ది క్రైమ్ న్యూస్):**మణుగూరు ఉపరితల గనులలో ప్రైవేట్ కంపెనీలన్నీ గుజరాత్ రాష్ట్రానికి చెందినవని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యురాలు మాజీ ఎంపీ బృందాకరత్ తెలిపారు. సోమవారం మణుగూరు ఉపరితల గనులలో పర్యటన నిర్వహించారు. ఓ సీ2 పని ప్రదేశాలను పరిశీలించారు స్థానిక సింగరేణి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు దుర్గా, మహాలక్ష్మి , వి బి ఆర్, ఎంఐ పిఎల్ కంపెనీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం మూడవసారి నిర్వాసిత గ్రామంగా మారనున్న కొంత కొండాపురం గ్రామ ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగరేణి ఓపెన్ కాస్ట్ లన్నీ కూడా 50 ప్రైవేటు 50 సింగరేణి కలసి ఓబి, బొగ్గును వెలికి తీస్తున్నాయని అన్నారు ఉప్రతల గనుల వలన వేలాది ఎకరాలు ప్రభుత్వ, అటవీ శాఖ భూములు ధ్వంసం అయ్యాయి అని అన్నారు. 1991 తర్వాత ప్రైవేటీకరణ వేగం విపరీతంగా పెరిగిందన్నారు సింగరేణి సంస్థలలో స్థానిక భూనిర్వాస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు భూములు కోల్పోయి ఉద్యోగులు రాక ఎస్సీ, ఎస్టీ, పేద ప్రజలు వేలాది మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయి అన్నారు. ఆదివాసి చట్టాలను ఫిఫ్త్ షెడ్యూల్డ్ అమలు చేయకపోవడం వలన ఈ ప్రాంత గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గిరిజన చట్టాలు మరియు ఫిఫ్త్ షెడ్యూల్ కూడా అమలు చేయలేదన్నారు గిరిజనులను సింగరేణి సరైన నష్టపరిహారం ప్యాకేజీ ఇవ్వలేదన్నారు ప్రస్తుతం మణుగూరులో అన్ని ఉపరితల గ్రంథంలో గుజరాత్ కు చెందిన కంపెనీలు మాత్రమే పనిచేస్తున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 80 శాతం కార్మికులు ఓబి కంపెనీలలో పని చేస్తున్నారని వారికి సరైన సౌకర్యాలు లేక అధిక పని గంటలు పనిచేస్తున్నారని దాని కారణంగా ఒత్తిడి గుర్తై తీవ్ర ఆందోళనకు చెందుతున్నారు. ఒక్క రూములో సరైన వెలుతురు గాలిలేని రూములలో బంధించి



ఉంచుతున్నారని అన్నారు. వెంటనే కార్మిక చట్టాల అమలు చేయాలన్నారు స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్త కొండాపురం భూ నిర్వాసిత గ్రామాన్ని పరిశీలించారు. మొదటిసారి నిర్వాసితులైనప్పుడు ఎకరానికి 3,500 ఇచ్చారని తెలిపారు.
ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చారని తెలిపారు రెండోసారి మణుగూరు ఓసి కారణంగా కొండాపురం గ్రామం రెండోసారి సరైన ప్యాకేజీ అందక చాలామంది భూములు కోల్పోయారని తెలిపారు.
ఫారెస్ట్ అధికారులు పోడు భూముల గుంజుకున్నారని తెలిపారు.
సిపిఎం పార్టీ భూ నిర్వాసితులకు అండగా ఉంటుందన్నారు .ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైద్రాబాద్ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి సింగరేణి కాలరీ స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బదిలి వర్కర్లకు మజ్దూర్లుగా పదోన్నతులు ఇప్పించాం

**- ఐఎన్టియూసి నాయకులు ధర్మపురి, అక్రమ్**

**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ ఓసీపీ.3 ప్రాజెక్టులో సోమవారం ప్రాతినిధ్య సంఘం ఐఎన్టియూసి ద్వారా సమావేశం జరిగింది. యూనియన్ డివిజన్ ఉపాధ్యక్షులు కొత్త సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన ప్రాజెక్టు లోని ఎస్.అండ్ డి సేక్షన్ లో జరిగిన సమావేశంలో యూనియన్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు ధరంపురి, ప్రధాన కార్యదర్శి ఎండి. అక్రమ్ మాట్లాడుతూ.. పెద్దలు జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ ఇప్పటివరకు పెండింగ్ సమస్యల పైన నిర్విరామైనా పోరాటం చేస్తూనే ఉందని, ఇందులో భాగంగానే 35 నుండి 40 సంవత్సరాల వరకు వయస్సు పరిమితి పెంచడం జరిగిందన్నారు. అలాగే లాభాల వాటా గతంలో కంటే 20,000 అదనంగా ప్రతి కార్మికునికి ఇప్పియడం జరిగిందని, మెడికల్ బోర్డులో అవకతవకలు లేకుండా నిర్వహించేలా కృషి చేస్తున్నారని, ఈరోజు 190/240 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లు గా పదోన్నతులు మేనేజ్మెంట్ తో మాట్లాడి ఇప్పించడం జరిగిందన్నారు. మొత్తం సింగరేణి వ్యాప్తంగా 2349 మంది జనరల్ మజ్దూర్లకు ఈరోజు



పదోన్నతి పత్రాలు ఇప్పించడం జరిగిందన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో ఒప్పించి కాంట్రాక్ట్ కార్మికులకు 5000 రూపాయల బోనస్ ఇవ్వాలని ఒక చరిత్రాత్మకమైన నిర్ణయాన్ని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి మంత్రి శ్రీధర్ బాబు లను ఐఎన్టీయూసీ నేత జనక్ ప్రసాద్ ఒప్పించి అమలు చేయడం జరిగిందన్నారు. ఒడిస్సాలో నైని బ్లాక్ లను కావాల్సిన పర్మిషన్లు ఇప్పించి, బొగ్గు ఉత్పత్తికి దారి సుముఖం చేశారు, నైనీ బ్లాక్ పైన 800 మెగా వాట్స్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి కూడా ఐఎన్టియూసి కృషి చేస్తుందని, గతంలో గెలిచిన టీబీజీకేఎస్ 10 సంవత్సరాలలో కార్మికులకు ఉన్న హక్కులను కూడా పోగొట్టి, ఇటు సింగరేణికి అటు కార్మిక వర్గాన్ని తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. కరోనా సాకుతో ఎన్ - 1 విధానాన్ని తీసుకువచ్చి కార్మికులను ఆర్థికంగా నష్టపరిచిందని, త్వరలో ఆ విధానాన్ని రద్దు చేయించడానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రెస్ మీట్ పెట్టి టీబీజీకేఎస్ చేసిన అరాచకం అన్యాయం కార్మిక దోపిడి వల్లనే సింగరేణి ప్రాంతంలో టిఆర్ఎస్ ఓడిపోయిందని ఇకనుండి టీబీజీకేస్ కు, టిఆర్ఎస్ కు ఎలాంటి సంబంధం ఉండదని చెప్పడం జరిగిందన్నారు. టీబీజీకేఎస్ గత వారం రోజుల క్రితం ధర్నాలు మీటింగ్లు అని చెప్పి కార్మికులను అయోమయానికి గురిచేస్తూ గనులపై తిరుగుతున్నారని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని వచ్చి చందాలు అడుగుతున్నారని వారు ప్రశ్నించారు. ఇంకా ఈ సమావేశంలో నాయకులు సంపత్ రెడ్డి, వాసంశెట్టి మార్కండేయ, దశరథం, కొంగర రవీందర్, నవీన్, ప్రణయ్ భాస్కర్, శంకర్ నాయక్ లింగయ్య, జాన్, బర్ల రవీందర్, చంద్రమౌళి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మోడీకి అసలుసిసలు వారసుడు జగన్

**- అందుకే చెట్టపట్టాలేసుకుని తిరిగాడు - మీడియా సమావేశంలో షర్మిల ఘాటు విమర్శలు**

**విజయవాడ,అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):** మోడీకి అసలుసిసలు వారసుడు జగన్ అని, అందుకే చెట్టపట్టాలేసుకుని తిరిగాడని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు విమర్శలు చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన జీవితం మొత్తం మత పిచ్చి బీజేపీనీ వ్యతిరేకిస్తే.. అదే బీజేపీకి జగన్ దత్తపుత్రుడు అయ్యాడని షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ షర్మిల మీడియా సమావేశంలో వైసీపీ అధినేత జగన్‌పై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీతో చెట్టాపట్టాలు వేసుకుని మోదీ వారసుడు జగన్ తిరిగారని ఆరోపించారు. అలాంటి వాళ్లకు వైఎస్సార్ ఆశయాలు గుర్తుకు ఉంటాయని అనుకోవడం, ఆశయాలకు వారసులు అవుతారనడం పొరపాటేనని విమర్శించారు. వైఎస్సార్ మానస పుత్రిక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అని గుర్తుచేశారు. నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్సార్ అద్భుతంగా అమలు చేస్తే.. సొంత కొడుకైన జగన్ మోహన్ రెడ్డి తన హయాంలో పథకాన్ని నీరు గార్చారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు రూ.3500 కోట్లు పెండింగ్ పెట్టడం నిజంగా సిగ్గుచేటు అని షర్మిల అన్నారు. కాయిలు



చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడారని విమర్శించారు. తల్లిదండ్రులను మనోవేదనకు గురి చేశారని చెప్పారు. దోచుకొని దాచుకోవడం మీద ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సంక్షేమం మీద వైసీపీ ప్రభుత్వం పెట్టలేదని విమర్శించారు. నాడు జగన్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చి నిర్వీర్యం చేయాలని చూస్తే.. నేడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్ షర్మిల ఆరోపించారు. సీపీ చేసింది మహా పాపమైతే.. కూటమి సర్కారు విద్యార్థులకు పెడుతున్నది శాపమని విమర్శలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. బకాయిలు ఎవరు పెండింగ్‌లో పెట్టినా.. అవి విడుదల చేసే బాధ్యత ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఉందని తెలిపారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, పథకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని షర్మిల డిమాండ్ చేశారు.
-

# రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన

**దేశంలోనే తొలిసారిగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళిక**

**కేంద్రమంత్రితో మంత్రి లోకేశ్ భేటీ**

**హడ్కో అధికారులతో మంత్రి నారాయణ చర్చలు**






**న్యూఢిల్లీ,అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళికలు, దేశంలోనే మొదటిసారిగా జరుగుతున్న స్కిల్ సెన్సస్‌కి సహకారం అందించాలని కేంద్ర మంత్రి, సెంట్రల్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అధికారులను ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఢిల్లీలోని కౌశల్ భవన్‌లో స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ శాఖ కేంద్రమంత్రి జయంత్ చౌధురి, సెక్రటరీ అతుల్ కుమార్ తివారీ, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈవో వేద్ మణి తివారీలతో ఏపీ మంత్రి నారా లోకేష్, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో చేపట్టనున్న స్కిల్ సెన్సస్‌పై మంత్రి లోకేష్ స్పెషల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. స్కిల్ సెన్సస్ లక్ష్యం, ఎలా చేపడుతున్నారని కేంద్రమంత్రి ఆరా తీశారు. స్కిల్ సెన్సస్ పైలెట్ ప్రాజెక్టు పూర్తి కాగానే గుర్తించిన లోటుపాట్లు సరిచేసి రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని లోకేష్ వివరించారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో లక్షలాది ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా స్కిల్ డెవలప్మెంట్, స్కిల్ సెన్సస్ చేపట్టిందని మంత్రి తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ లక్ష్యం చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మంత్రిత్వశాఖల నుంచి ఏపీకి ఏమేం కావాలో వివరిస్తూ ఓ లేఖను మంత్రి నారా లోకేష్ అందజేశారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో నైపుణ్యం గల మానవవనరులను ఏపీ నుంచి అందించే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీని కోసం స్కిల్ డెవలప్మెంట్ కేంద్ర సంస్థలు ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. పబ్లిక్- ప్రైవేటు పార్టనర్ షిప్ మోడల్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ అమరావతిలో నెలకొల్పాలి. వారణాసి, హైదరాబాద్‌లలో విజయవంతంగా నడుస్తున్న మాదిరిగానే స్కిల్ ఇండియా ఇంటర్నేషన్ సెంటర్ ఇన్ అమరావతి కావాలి. గతంలోనే విశాఖపట్నంలో ఏడు ఎకరాలు కేటాయింపు జరిగిన చోట నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ , అమరావతిలో నిర్మాణరంగం, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చేనేత-హస్తకళలు, విశాఖలో ఫార్మా లాబ్స్, నెల్లూరు, తిరుపతిలో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలు నెలకొల్పేందుకు స్కిల్ కౌన్సిల్ సహకారం అందించాలన్నారు. నేషనల్ స్కిల్ డెలవప్మెంట్ వెబ్ సైట్లతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ అనుసంధానం చేయాలి. గిరిజనుల నైపుణ్య శిక్షణ కేంద్రాలు నెలకొల్పేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని అన్నారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో గణేష్ కుమార్, ఈడీ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.మరోవైపు ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారాయణ కూడా హడ్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏకే సింఘాల్, హడ్కో సీఎండీ సంజయ్, హడ్కో విజయవాడ చీఫ్ మూర్తి పాల్గొన్నారు. అమరావతి నిర్మాణం, నెల్లూరులో అభివృద్ధి కార్యక్రమాలకు హడ్కో రుణంపై చర్చించారు. అమరావతి నిర్మాణంలో ప్రభుత్వ విధానాన్ని మంత్రి వివరించారు. అమరావతి నిర్మాణానికి సీఆర్‌డీఏకు రూ.11 వేల కోట్ల రుణం మంజూరు హడ్కో హామీ ఇచ్చింది. నెల్లూరులో అభివృద్ధి పనులకు రూ.165 కోట్ల రుణం విడుదల చేసేందుకు అంగీకారం తెలిపింది. వారం రోజుల్లో రుణ పక్రియ ప్రారంభిస్తామని వెల్లడించింది. కేంద్ర మంత్రి అమిత్‌షాను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కలిశారు. ఏపీలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. విశాఖ లేదా అమరావతిలో ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుడగ జంగాలకు సంక్షేమం, విద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక అవసరాలకు సమగ్ర విధానం తయారు చేయాలనికోరారు.ఎంపీ విజ్ఞప్తికి అమిత్‌షా సానుకూలంగా స్పందించారు.

# ములుగు జిల్లాలో పలు అభివృద్ధి పనులు

**వెంకటాపూర్‌లో కంప్యూటర్ ల్యాబ్‌కు సీతక్క ప్రారంభం**

**ములుగు,అక్టోబర్21(ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో రాష్ట్ర మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత వెంకటాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (సీఎస్ఆర్ నిధులు, మౌరిటెక్ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో) ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట మండలం చల్వాయి నుంచి బుస్సాపూర్, లక్నవరం సరస్సు వరకు రూ.3.60 కోట్ల నిధులతో రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గోవిందరావుపేట మండల కేంద్రం నుంచి ఎల్బీ నగర్ మీదుగా దుంపల్లిగూడెం వరకు, బాలాజీనగర్ జడ్పీ క్రాస్ రోడ్డు నుంచి సంద్రగూడెం మీదుగా లక్ష్మీపూర్ వరకు, తాతయిపల్లి నుంచి పాపయ్యపల్లి మీదుగా మద్దులగూడెం వరకు రహదారి మరమ్మతు పనులను ప్రారంభించారు.

# నిమిషాల్లో రూ. 1లక్ష విత్ డ్రా..

# పీఎఫ్ ఖాతాదారులు చేయాల్సిందిదే..




ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) ఖాతా ప్రతి ఉద్యోగికి ఉంటుంది. ఇది పదవీవిరమణ తర్వాత జీవితానికి ఉపయోగపడేలా రూపొందించిన స్కీమ్. దీనిని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) నిర్వహిస్తుంది. ప్రతి నెలా ఉద్యోగి నుంచి అలాగే తను పనిచేసే కంపెనీ నుంచి కొంత భాగం దానిలో జమవుతుంది. సాధారణంగా దీనిలో మొత్తాన్ని పదవీవిరమణ తర్వాత తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎంప్లాయి కంట్రిబ్యూషన్ నుంచి కొంత మొత్తాన్ని తీసుకునే వీలుంటుంది. వైద్య చికిత్స, వివాహాలు, విద్య, గృహ రుణాలు, గృహ నిర్మాణ ఖర్చులు వంటి నిర్దిష్ట ఆర్థిక అవసరాలకు దీని నుంచి నగదును ముందస్తుగా ఉపసంహరించుకునే వీలుంటుంది. అయితే ఎక్కువ శాతం మెడికల్ ఎమర్జెన్సీ వచ్చిన సమయంలోనే దీని నగదు విత్ డ్రా చేసేందుకు ఖాతాదారులు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో అత్యవసర చికిత్సల వేళ పీఎఫ్ నుంచి నగదు ఎలా విత్ డ్రా చేసుకోవచ్చు? తెలియాలంటే ఈ కథనం .. మెడికల్ ఎమర్జెన్సీ వేళ పీఎఫ్ ఉపసంహరణ.. వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు లేదా ప్రాణాంతక పరిస్థితుల కారణంగా ఆస్పత్రిలో చేరిన సందర్భంలో, ఈపీఎఫ్ఓ ??సభ్యులు రూ. 1 లక్ష వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. గతంలో ఈ అడ్వాన్స్ తీసుకోవాలంటే ఆస్పత్రి నుంచి ఎస్టిమేషన్ సమర్పించాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఎటువంటి డాక్యుమెంటేషన్ అవసరం లేకుండానే రూ. లక్ష ఏక మొత్తంలో మెడికల్ అడ్వాన్స్ మంజూరు చేస్తున్నారు. ఎందుకంటే ప్రాణాంతకమైన అనారోగ్యాల విషయంలో, రోగిని అతని/ఆమె ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రిలో చేర్చడం తప్పనిసరి అని, అటువంటి తీవ్రమైన పరిస్థితుల్లో ఆసుపత్రి నుంచి అంచనాను పొందడం సాధ్యం కాదని ఈపీఎఫ్ఓఈ నిర్ణయం తీసుకుంది. కొన్ని షరతులు ఉన్నాయి.. అయితే ఏక మొత్తంలో రూ. లక్ష విత్ డ్రా చేసే సమయంలో వ్యాధి చికిత్సకు సంబంధించి ఈఎస్ఐసీ లేదా సీజీహెచ్ఎస్ ఎంప్యానెల్డ్ హాస్పిటల్ వంటి ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ విభాగంలో చేరిన వారు ఉపసంహరణలు చేయవచ్చు. ప్రైవేట్ ఆసుపత్రి విషయంలో మాత్రం ఈపీఎఫ్ఓ ప్రాథమికంగా కొన్ని అంశాలు తనిఖీ చేసి అడ్వాన్స్ ఇవ్వవచ్చా లేదా అనేది నిర్ణయిస్తారు. ఈపీఎఫ్ అడ్వాన్స్ క్లెయిమ్ ఇలా.. ఈపీఎఫ్ఓ పోర్టల్‌కి వెళ్లండి. మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్ పాస్‌వర్డ్‌ని నమోదు చేయండి. లాగిన్ చేయడానికి క్యాప్చా కోడ్‌ను టైప్ చేయండి. మీకు ఓపెన్ అయిన పేజీలో మీ బ్యాంక్ ఖాతా సమాచారాన్ని నమోదు చేసి, కొనసాగించడానికి "వ్యాలిడేట్" ఎంచుకోండి. ఈ సమాచారం మీ పీఎఫ్ ఖాతాకు లింక్ అవుతుంది. ఇప్పుడు, నిబంధనలు, షరతులను అంగీకరించడానికి "ఎస్"పై క్లిక్ చేయండి. ఆ తర్వాత "ఆన్‌లైన్ సర్వీసెస్" లింక్‌ని క్లిక్ చేసి, అనారోగ్యం కోసం క్లెయిమ్ ఫారమ్-31ని ఎంచుకోండి దీని తర్వాత, 'ప్రొసీడ్ ఫర్ ఆన్‌లైన్ క్లెయిమ్'పై క్లిక్ చేయండి. రోగి ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయినట్లయితే, పీఎఫ్ ఉపసంహరణ సౌకర్యాన్ని పొందేందుకు ఒక ఉద్యోగి తప్పనిసరిగా 45 రోజులలోపు మెడికల్ బిల్లులను ఈపీఎఫ్ఓకి సమర్పించాలి. ప్రాసెస్ చేసిన తర్వాత, క్లెయిమ్ ఆమోదం కోసం యజమానికి ఇది వెళ్తుంది. సబ్‌స్క్రైబర్‌లు 'ఆన్‌లైన్ సర్వీస్' విభాగంలో 'క్లెయిమ్ స్టేటస్' ఎంపికను ఎంచుకోవడం ద్వారా మీ క్లెయిమ్ స్థితిని పర్యవేక్షించవచ్చు.

## ఏజెంట్లతో జాగ్రత్త సుమా? పెట్టుబడి పెట్టేముందు ఈ విషయాలు తెలుసుకోకపోతే నష్టపోతారు..



పెట్టుబడి పథకాలు మార్కెట్లో చాలానే ఉంటాయి. వాటిల్లో బెస్ట్ ఎంపిక చేసుకోవడం, దానిలో పెట్టుబడి పెట్టడం అనుకున్నంత సులభం కాదు. జాతీయ స్థాయిలో చాలా పథకాలు మనకు అందుబాటులో ఉంటాయి. వాటిని నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్(ఎన్ఎస్ఎస్) అని పిలుస్తారు. వీటిల్లో పెట్టుబడి పెట్టేందుకు కొంత మంది ఏజెంట్ల ఆశ్రయిస్తారు. వారి ద్వారా తమ పెట్టుబడులను డైవర్సిఫై చేస్తుంటారు. అయితే మీ ఆర్థిక లక్ష్యాలను చేరుకోడానికి మీరు చేసే ఈ ప్రయత్నంలో మీరు విజయం సాధించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.. ముఖ్యంగా ఏజెంట్ ద్వారా పెట్టుబడులు పెట్టే వారు ఈ విషయాన్ని తప్పక తెలుసుకోవాలి. అందుకే నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న టాప్ సేవింగ్స్ స్కీమ్స్, ఏజెంట్ ద్వారా వాటిల్లో పెట్టుబడులు పేట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్ రకాలు ఇవి.. నేషనల్ సేవింగ్స్ ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, నేషనల్ సేవింగ్స్ స్కీమ్‌లలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న పథకాలు ఇవి.. పోస్ట్ ఆఫీస్ సేవింగ్ అకౌంట్ నేషనల్ సేవింగ్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ నేషనల్ సేవింగ్ టైమ్ డిపాజిట్ అకౌంట్ జాతీయ పొదుపు నెలవారీ ఆదాయ ఖాతా సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ కిసాన్ వికాస్ పత్ర పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ సుకన్య సమృద్ధి ఖాతా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 2023 వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు మీకు అధీకృత ఏజెంట్లు మీకు సహాయం చేస్తారు. అయితే వారిపై పూర్తిగా ఆధారపడటం మంచిది కాదు. ఏదైనా నిర్ణయాలు తీసుకునే ముందు మీ పరిశోధన చేయండి లేదా ఆర్థిక సలహాదారుని సంప్రదించండి నేషనల్ స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ లో ఏదైనా ఖాతా ను మీరు వ్యక్తిగతంగా పోస్టాఫీసు/బ్యాంక్ బ్రాంచ్‌ను సందర్శించడం ద్వారా డబ్బును స్వయంగా జమ చేయవచ్చు. కిసాన్ వికాస్ పత్ర, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి ఖాతా వంటి నిర్దిష్ట పథకాలకు ఆన్‌లైన్ డిపాజిట్లు చేసే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇప్పుడు ఏజెంట్ల ద్వారా పెట్టుబడి పెట్టే ముందు చేయాల్సిన, చేయకూడని అంశాలను పరిశీలిద్దాం. మొదటిగా ఏజెంట్ల సర్టిఫికెట్ ఆఫ్ అథారిటీ, ఏజెన్సీ చెల్లుబాటు తేదీని తనిఖీ చేయడం ద్వారా అధీకృత ఏజెంట్ల గుర్తింపును తెలుసుకోండి. దరఖాస్తు ఫారమ్‌ను మీరే పూరించండి. అయితే, ఏజెంట్ సహాయం/మార్గనిర్దేశం పొందవచ్చు. ఖాతా తెరవడం లేదా డిపాజిట్ చేయడం కోసం ఏజెంట్‌కు డబ్బు/పరికరాలు, పత్రాలను అందజేసేటప్పుడు ఏజెంట్ పూర్తి చేసిన అధీకృత రసీదులను అడగండి. ఈ రసీదు పుస్తకాలను ప్రభుత్వం ఏజెంట్లకు సరఫరా చేస్తుంది. ఖాతా మెచ్యూరిటీ అయ్యే వరకు కౌంటర్‌ఫాయిల్‌లను భద్రపరచండి. రసీదు ఇవ్వడానికి ఏజెంట్ తిరస్కరిస్తే ఆ విషయాన్ని పోస్టల్/జిల్లా అధికారులకు నివేదించండి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి 10 రోజులలోపు ఏజెంట్ నుంచి పాస్‌బుక్ అందినట్లు నిర్ధారించుకోండి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి 10 రోజులలోపు ఏజెంట్ నుంచి పాస్‌బుక్ అందని పక్షంలో, అపాయింటింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయండిబీ ప్రాంతీయ డైరెక్టర్, నేషనల్ సేవింగ్స్ ఇన్స్టిట్యూట్‌బీ పోస్ట్‌మాస్టర్ కు ఫిర్యాదు చేయొచ్చు. పాస్‌బుక్‌లో పేర్కొన్న మొత్తం, తేదీ, స్టాంపు, సంతకం మొదలైన వాటి కచ్చితత్వాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత పోస్టాఫీసు నుంచి ధ్రువీకరించుకోండి. అనధికార వ్యక్తికి నగదును అందజేయవద్దు లేదా ఏజెంట్‌కు అనుకూలంగా చెక్కును జారీ చేయవద్దు. రూ. 10,000, అంతకంటే ఎక్కువ పెట్టుబడులకుబీ సంబంధిత పోస్ట్‌మాస్టర్‌కు అనుకూలంగా మాత్రమే చెక్కును జారీ చేయండి. మెచ్యూరిటీకి ముందు ఉపసంహరణ ఫారమ్‌ను పూరించవద్దు/సంతకం చేయవద్దు.

## ఇకపై జొమాటోలో ఆ సేవలు కూడా.. పేటీఎంతో రూ. 2వేల కోట్ల ఢీల్..








ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో తన సేవలను విస్తరిస్తోంది. కేవలం ఫుడ్ డెలివరీకి మాత్రమే పరిమితం కాకుండా ఇతర సేవలను సైతం యూజర్లకు అందిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జొమాటో యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. జొమాటో నుంచి ఫుడ్ ఆర్డర్ చేసుకొని పేమెంట్ కోసం ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకునే పనిలేకుండా నేరుగా జొమాటోలోనే పేమెంట్ చేసేందుకు గాను ఈ సేవలను తీసుకొచ్చినట్లు కంపెనీ ప్రకటించింది. ఇదిలా ఉంటే తాజాగా మరో కొత్త సర్వీస్‌ను జొమాటో పరిచయం చేసింది. జొమాటోలో ఇకపై టికెట్లు, ఈవెంట్ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పేటీఎంతో జొమాటో ఢీల్ చేసుకుంది. పేటీఎంకు చెందిన మూవీ, ఈవెంట్స్ టికెటింగ్ వ్యాపారాలను కొనుగోలు చేయనున్నట్టు జొమాటో ఓ ప్రకటన విడుదల చేసింది. ఎంటర్‌టైన్‌మెంట్ సెగ్మెంట్‌లోనూ సత్తా చాటేందుకు జొమాటో ఈ నిర్ణయం తీసుకుంది. మూవీ, ఈవెంట్స్ టికెటింగ్ వ్యాపారాలను 244.2 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయనున్నట్లు జొమాటో ప్రకటించింది. మన కరెన్సీలో చెప్పాలంటే సుమారు రూ. 2వేల కోట్లకు పైమాటే. కాగా ప్రస్తుతం ఈ రంగంలో బుక్‌మై షో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అయితే లు, లైవ్ ఈవెంట్ల కోసం భారతదేశ ఆన్‌లైన్ టికెటింగ్ మార్కెట్‌లో పోటీనిచ్చేందుకే జొమాటో ఈ నిర్ణయం తీసుకుంది. టికెట్లను విక్రయించే 'టికెట్ న్యూ' ప్లాట్‌ఫామ్‌తో పాటు లైవ్ ఈవెంట్లకు టికెట్లను నిర్వహించే 'ఇన్‌సైడర్' ప్లాట్‌ఫామ్‌ని విక్రయించడం ద్వారా తన మార్కెట్ వాటాను పేటీఎం జొమాటోకు అప్పగించనుంది. ఈ కొనుగోలుతో వచ్చే రెండేళ్లలో నాన్ కోర్ వ్యాపారాల్లో ఆదాయం మూడు రెట్లు పెరుగుతుందని తమ షేర్ హోల్డర్స్‌కి లెటర్‌లో పేర్కొంది.

## ఉచితంగా నెట్‌ఫ్లిక్స్ సేవలు పొందే అవకాశం.. స్పెషల్ రీఛార్జ్ ప్లాన్స్

టెలికం కంపెనీల మధ్య నెలకొన్న పోటీ నేపథ్యంలో యూజర్లను ఆకర్షిస్తున్నాయి. ఇటీవల టెలికం కంపెనీలు రీఛార్జ్ ధరలను పెంచిన తర్వాత యూజర్లను అట్రాక్ట్ చేసే పనిలో పడ్డాయి. ఇందులో భాగంగానే రకరకాల ఆఫర్లను అందిస్తున్నాయి. ముఖ్యంగా ఓటీటీ ప్లాట్‌ఫామల వినియోగం పెరిగిన తర్వాత వారిని టార్గెట్ చేసుకొని రీఛార్జ్ ప్లాన్స్‌ను తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగానే పలు టెలికం సంస్థలు నెట్‌ఫ్లిక్స్‌ను ఉచితంగా అందించే ప్లాన్స్‌ను అందిస్తున్నాయి. జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా లభిస్తున్న కొన్ని బెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా లభిస్తున్న రీఛార్జ్ ప్లాన్స్‌లో రూ. 1299 ఒకటి. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే నెట్‌ఫ్లిక్స్‌ను ఉచింగా యాక్సెక్ చేసుకోవచ్చు. 84 రోజుల వ్యాలిడిటీ లభించే ఈ ప్లాన్ ద్వారా అన్‌లిమిటెడ్ కాల్స్ పొందొచ్చు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. మొత్తం 168 జీబీ డేటా పొందొచ్చు. రోజుకు 2 జీబీ డేటా పొందొచ్చు. ఇక జియో అందిస్తోన్న మరో బెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్‌లో రూ. 1799 ఒకటి. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజులు వ్యాలిడిటీ లభిస్తుంది. రోజూ 3 జీబీ డేటా పొందొచ్చు. అలాగే అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లతో పాటు నెట్‌ఫ్లిక్స్ ఉచితంగా యాక్సెస్ చేసుకోవచ్చు. నెట్ ఫ్లిక్స్ ఉచితంగా పొందేలా వొడాఫోన్ ఐడియా రూ. 1198 రీఛార్జ్ ప్లాన్‌ను అందిస్తోంది. ఈ ప్లాన్ మొత్తం 70 రోజుల పాటు 2 జీబీ డేటా పొందొచ్చు. మొత్తం 140 జీబీ పొందొచ్చు. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. వొడాఫోన్ ఐడియా అందిస్తోన్న మరో బెస్ట్ ఫ్లాన్ రూ. 1599. ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజులపాటు వ్యాలిడిటీ లభిస్తోంది. ప్రతీ రోజూ 2.5 జీబీ డేటా పొందొచ్చు. మొత్తం 210 జీబీ డేటా లభిస్తుంది. ఇక ఉచిత నెట్‌ఫ్లిక్స్‌తో పాటు.. అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు పొందొచ్చు. ఇక ఎయిర్ కూడా ఇలాంటి ఒక ప్లాన్‌ను అందిస్తోంది.ఎయిర్‌టెల్ తీసుకొచ్చిన రూ.1798 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకుంటే 84 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ప్రతీ రోజూ 3 బీబీ డేటా చొప్పున మొత్తం 252 జీబీ డేటా పొందొచ్చు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లుపొందొచ్చు. అన్‌లిమిటెడ్ 5జీ డేటా లభిస్తుంది.



# వ్యాపారం

## పర్యాటకులకు శుభవార్త..

### ఈ దేశం భారత్ సహా 35 దేశాలకు వీసా రహిత యాక్సెస్




ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లాలంటే వీసా తప్పనిసరి కావాల్సిందే. అయితే ఇటీవల కాలం నుంచి కొన్ని దేశాలు ఎలాంటి వీసా లేకుండా అనుమతి ఇస్తున్నాయి. భారత్‌తో పాటు ఇతర దేశాలకు కొన్ని దేశాలు వీసా రహిత సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్‌లకు పొరుగు దేశం శ్రీలంక శుభవార్త అందించింది. పొరుగు దేశం భారతదేశంతో సహా అనేక దేశాల నివాసితులకు వీసా రహిత ప్రాప్యతను ప్రకటించింది. ప్రకటన ప్రకారం, భారతీయ ప్రయాణికులు త్వరలో శ్రీలంకకు వీసా రహిత సదుపాయం పొందవచ్చు. 35 దేశాలు 6 నెలల పాటు ప్రయోజనం వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం, శ్రీలంక 35 దేశాలకు వీసా-రహిత యాక్సెస్ సౌకర్యాన్ని ప్రకటించింది. వాటిలో భారతదేశం, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఉన్నాయి. అక్టోబరు 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. 6 నెలల పాటు దీన్ని అమలు చేస్తున్నారు. ఈ మార్పును శ్రీలంక ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదించింది. భారత్‌తో పాటు ఈ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ప్రయోజనం శ్రీలంక పర్యాటక మంత్రి హరీన్ ఫెర్నాండోను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. అక్టోబర్ 1 నుండి 35 దేశాల నుండి వచ్చే ప్రయాణికులకు శ్రీలంకకు వెళ్లడానికి వీసా అవసరం లేదు. ఈ పాలసీ ఆరు నెలలపాటు ఉంటుంది. చైనా, జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, స్పెయిన్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, పోలాండ్, కజకిస్తాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నేపాల్, ఇండోనేషియా, రష్యా, థాయిలాండ్‌తోపాటు భారతదేశం, అమెరికా, బ్రిటన్‌లు ఈ సదుపాయాన్ని పొందబోతున్నాయి. ఈ దేశాల పాస్‌పోర్ట్ హోల్డర్‌లకు కూడా సౌకర్యం.. మలేషియా, జపాన్, ఫ్రాన్స్, కెనడా, చెక్ రిపబ్లిక్, ఇటలీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, ఇజ్రాయెల్, బెలారస్, ఇరాన్, స్వీడన్, దక్షిణ కొరియా, ఖతార్, ఒమన్, బహ్రెయిన్, న్యూజిలాండ్ వంటి దేశాల పాస్‌పోర్ట్ హోల్డర్లు కూడా వీసా రహిత యాక్సెస్‌ను పొందబోతున్నారు. భారతీయులు వీసా ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు శ్రీలంక ఆర్థిక వ్యవస్థకు పర్యాటకం చాలా ముఖ్యమైనది. ప్రతి సంవత్సరం వివిధ దేశాల నుంచి లక్షలాది మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించేందుకు వస్తుంటారు. కొద్ది రోజుల క్రితమే శ్రీలంకలో వీసా ఆన్ అరైవల్ ఫీజును పెంచి వివాదం సృష్టించారు. శ్రీలంకలో వీసా ఆన్ అరైవల్ సౌకర్యాన్ని ఒక విదేశీ కంపెనీ నిర్వహిస్తోంది. భారతదేశం, చైనా, జపాన్, రష్యా, మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా నుండి ప్రజలు ఎటువంటి రుసుము లేకుండా శ్రీలంకలో పర్యాటక వీసాలు పొందుతారు.

## దేశంలోని 540 నగరాల్లో టాటా ఛార్జింగ్ స్టేషన్లు.. ఈ కంపెనీలతో ఒప్పందం



టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ సదుపాయాలను మరింత మెరుగుపరచడానికి డెల్టా ఎలక్ట్రానిక్స్ ఇండియా, థండర్‌ప్లస్ సొల్యూషన్స్ అనే రెండు ప్రముఖ కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను మరింత సౌకర్యవంతంగా, అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యం పెట్టుకుంది టాటా. భారతదేశంలోని ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలలో ఒకటైన టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. సంస్థ ఈ భాగస్వామ్యంలో 540 కొత్త ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు స్థాపించింది. తద్వారా ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఛార్జింగ్ కోసం ఆప్షన్లను పొందవచ్చు. అలాగే వారు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు. 50కి పైగా నగరాల్లో ఛార్జింగ్ స్టేషన్లు: టాటా మోటార్స్ ఈ ఛార్జింగ్ పాయింట్ 50 కంటే ఎక్కువ నగరాల్లో ఇన్‌స్టాల్ కానున్నాయి. ఈ నగరాల్లో 540కి పైగా ఛార్జింగ్ స్టేషన్లు నిర్మించనున్నారు. టాటా మోటార్స్ ప్రకారం, ఈ ఛార్జింగ్ స్టేషన్ ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, పూణె, కొచ్చి వంటి నగరాల్లో ఏర్పాటు కానున్నాయి. అలాగే, ఎక్కువగా ఉపయోగించే రూట్లలో ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించనున్నట్లు టాటా మోటార్స్ తన ప్రకటనలో తెలిపింది. తద్వారా కస్టమర్లు మరింత సౌలభ్యాన్ని పొందుతారు. ఈవీ వాహనాలకు మరింత ప్రోత్సాహాన్ని పొందుతారు. మీరు ఈ విధంగా ప్రయోజనం పొందుతారు. ఛార్జింగ్ సౌకర్యాలు సులభంగా అందుబాటులో ఉంటే, ఎక్కువ మంది ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను అవలంబిస్తారు. ఇది కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా దేశ ఇంధన భద్రతను కూడా పెంచుతుంది. అదనంగా, టాటా మోటార్స్ రాబోయే సంవత్సరాల్లో కొత్త ఈవీ మోడళ్లను విడుదల చేయడానికి తన ఈవీ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరింపజేస్తుందని, ఇది భారతీయ కస్టమర్ల అవసరాలు, ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడుతుందని స్పష్టం చేసింది. ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రోత్సహించడానికి ప్రాధాన్యత ఈ భాగస్వామ్యం ద్వారా టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రోత్సహించడమే కాకుండా, స్థిరమైన, పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దశ భారతదేశ ఈవీ పరిశ్రమ అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, దేశం క్లీన్, గ్రీన్ ఎనర్జీ వైపు పయనించడంలో సహాయపడుతుందని కంపెనీ విశ్వసిస్తోంది.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇది తాగితే

# ఆ సమస్యలన్నీ మటాష్



రోజూ మన డైట్‌లో అల్లం భాగం చేసుకోవడం వల్ల ఎన్నో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం మీ టీతో పాటు ఆహారం రుచిని పెంచుతుంది. అయితే మీరు ఎప్పుడైనా అల్లం నీళ్లు తాగారా? ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి అల్లం నీరు తాగడం సులభమైన మార్గం. ఆయుర్వేదంలో అల్లం ఔషధ గుణాలకు ప్రసిద్ధి. పురాతన వైద్యంలో అల్లం అనేక వ్యాధులను నయం చేయడానికి ఒక మూలికగా ఉపయోగించారన్న విషయం తెలిసిందే కదా..! అల్లంలో శరీరానికి అవసరమైన విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్, క్రోమియం వంటి పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా



ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగితే అల్లం వల్ల కలిగే ప్రయోజనాలన్నీ శరీరానికి అందుతాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం 1. బరువు తగ్గుతారు ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది కొవ్వును వేగంగా కరిగించడంలో సహాయపడుతుంది. మీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడానికి ఉపయోగపడుతుంది 2. షుగర్ బాధితులకు ప్రయోజనకరం: ఖాళీ కడుపుతో అల్లం నీరు తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే, రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా ఉంటుంది. ఇది మధుమేహం వల్ల వచ్చే సమస్యల నుండి బయటపడటానికి సహాయపడుతుంది. 3. చర్మానికి మేలు చేస్తుంది: అల్లం నీరు శరీరంలో పేరుకుపోయిన మురికి, టాక్సిన్స్ ను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. చర్మంపై దద్దుర్లు, మొటిమలు, ముడతలు వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది మీ రక్తాన్ని సహజంగా శుద్ధి చేయడంలో యూజ్ అవుతుంది 4. ఇన్‌ఫ్లమేటరీ సమస్యలు దూరం : అల్లం శరీరంలోని ఇన్‌ఫ్లమేటరీ సమస్యలను దూరం చేయడంలో సహాయపడుతుంది. అల్లం వాపును కలిగించే సూక్ష్మజీవులు, హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. 5. పొట్టకు మేలు చేస్తుంది: ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దీని కారణంగా, అజీర్ణం, మలబద్ధకం, ఉబ్బరం, వాంతులు, విరేచనాలు, వికారం వంటి సమస్యలను తొలగించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అదనంగా, అల్లం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీని వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించి గుండె ఆరోగ్యంగా ఉంచుతుంది.

## ఇదేం చేస్తుందిలే అని చీప్‌గా చూడకండి..

### ఆ సమస్యలకు పవర్‌ఫుల్ వెపన్.. డైలీ జ్యూస్ తాగితే..



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి జీవనశైలిని అవలంభించాలని.. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే.. ఆరోగ్యానికి మేలు చేసే దుంపల్లో బీట్‌రూట్ ఒకటి.. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వాస్తవానికి బీట్ రూట్‌ను సలాడ్‌గా తీసుకుంటారు. కొందరు బీట్ రూట్ మామూలుగా తింటే.. మరికొందరు జ్యూస్ చేసుకుని తాగుతారు. బీట్‌రూట్‌లో ఐరన్, సోడియం, సెలీనియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది.. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా కొవ్వు మొదలైన వాటిని తగ్గించడంలో సహాయపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అందుకే బీట్ రూట్ ను తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు. బీట్ రూట్ రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకోండి.. బ్లడ్ ప్రెజర్ కంట్రోల్: బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందులో నైట్రేట్ ఉండటం వల్ల శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. బరువు నియంత్రణ: బీట్‌రూట్ రసంలో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల రోజంతా శరీరానికి శక్తి లభిస్తుంది. కాలేయానికి మేలు చేస్తుంది: బీట్‌రూట్‌లోని బీటైన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కాలేయంలో కొవ్వు ఆమ్లాలు పేరుకుపోకుండా చేస్తుంది. ఇది కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది: బీట్‌రూట్‌లో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది శరీరంలోని కండరాలు, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. గుండెకు మేలు చేస్తుంది: బీట్‌రూట్ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే శరీరంలో ప్లాస్మా నైట్రేట్ స్థాయిలను పెంచుతుంది. ఇది శరీరం స్టామినాను పెంచుతుంది. క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది: బీట్‌రూట్ రసంలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది క్యాన్సర్ ప్రమాదం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది.



## వామ్మో.. రక్తహీనతతో బాధపడుతున్నారా..? డేంజర్ జోన్ నుంచి బయటపడాలంటే ఇలా చేయండి



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కొవలసి వస్తోంది.. ముఖ్యంగా పేలవమైన జీవనశైలి, అనారోగ్యమైన ఆహారం.. పని ఒత్తిడి.. ఇవన్నీ రోగాల బారిన పడేలా చేస్తున్నాయి. శరీరానికి కావలసిన పోషకాలు, విటమిన్లు అందకపోతే.. ప్రమాదంలో పడినట్లే.. అందుకే.. తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలంటున్నారు వైద్య నిపుణులు.. అయితే, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మీ శరీరంలో తగినంత ఐరన్ ఉండటం చాలా ముఖ్యం. ఇనుము లోపం మీ ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడు చేస్తుంది. శరీరంలో విటమిన్లు పుష్కలంగా ఉండటానికి కొన్ని ఆహారాలను తీసుకోవాలి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకోండి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఇవి తినండి.. దానిమ్మ: శరీరంలో విటమిన్లు, ఖనిజాలు ఉండటం చాలా ముఖ్యం. వీటి లోపం వల్ల అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల అనేక రకాల సమస్యలు వస్తాయి. శరీరంలో ఐరన్ తక్కువగా ఉన్నప్పుడు, చాలా బలహీనత ఉంటుంది. ఐరన్ లోపం ఉన్నవారు ఆహారంలో దానిమ్మను చేర్చుకుంటే చాలా మంచిది.. దీనివల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడొచ్చు.. గుడ్డు: ఐరన్ లోపం ఉన్నవారు ఉదయం అల్పాహారంగా కూడా గుడ్లు తీసుకోవాలి. గుడ్లలో మంచి మొత్తంలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఐరన్ ఉంటాయి. దీని వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడదు.. గుడ్లలో విటమిన్ డి కూడా లభిస్తుంది. ఐరన్ లోపం ఉన్నవారు తప్పనిసరిగా గుడ్లు తినాలి. రెగ్యులర్ గా మీ ఆహారంలో ఒక గుడ్డును చేర్చుకోండి.. బీట్‌రూట్: రోజూ బీట్‌రూట్ తీసుకోవడం వల్ల మీ శరీరంలోని రక్తహీనత తొలగిపోతుంది. ఇనుము లోపం నయమైతే, అనేక వ్యాధులు కూడా నయమవుతాయి. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించవచ్చు.. బీట్‌రూట్ తినడం వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. ఇది మీ కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా చాలా సహాయపడుతుంది. పాలకూర: పాలకూరలో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. పాలకూరలో కాల్షియం, సోడియం, ఖనిజ లవణాలు, క్లోరిన్, ఫాస్పరస్, అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరాన్ని ఇనుము లోపం నుంచి దూరంగా ఉంచుతాయి. ఇంకా ఒత్తిడిని తగ్గించడం ద్వారా మీ శరీరాన్ని రిలాక్స్ చేయడంలో కూడా ఇవి సహాయపడతాయి. పండ్లు కూరగాయలు: తాజా పండ్లు, కూరగాయలు మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. తాజా, పండ్లు కూరగాయల్లో ఐరన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. కావున వీటిని ప్రతిరోజూ తింటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు..

## గుడ్లలో కంటే ఎక్కువ ప్రోటీన్ కావాలా..? అయితే ఈ పప్పులను తినండి.. ఇక నో టెన్షన్..



శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవడానికి విటమిన్లు, మినరల్స్‌తో పాటు ప్రొటీన్లు కూడా చాలా అవసరం. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ప్రోటీన్ సహాయపడుతుంది. అయితే, శరీర అభివృద్ధి నుంచి రోగనిరోధక శక్తిని పెంచడానికి ప్రోటీన్ తోపాటు విటమిన్లు చాలా సహాయపడతాయి. ప్రోటీన్ మూలాలలో ఒకటి గుడ్లు.. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ రోజుకు కనీసం 1 గుడ్డు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, తృణధాన్యాల్లో (పప్పులు) గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయి. అయితే, చాలామంది గుడ్లు తినరు లేదా మాంసాహారం తీసుకోరు.. అలాంటి వారికి ప్రొటిన్ లోపం ఉంటుంది.. అలాంటి వారు శరీరంలో ప్రోటీన్ స్థాయిలను నిర్వహించడానికి వారు పప్పులను తినవచ్చు. కొన్ని పప్పుల్లో గుడ్లు కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పప్పులలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిని అన్నం లేదా రొట్టెలతో తినవచ్చు. పప్పు చాలా మందికి సులభంగా జీర్ణం కాదు. అలాంటప్పుడు పప్పు చారు తినడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పప్పు ఆరోగ్యానికి చాలా మంచిది. కందిపప్పు, మసూర్ పప్పు, పెసర పప్పులో గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని చెబుతున్నారు. కాబట్టి తల్లులు, అమ్మమ్మలు ఉపవాసం ఉన్నప్పుడు, శనగపప్పు ఉడకబెట్టి తింటారు. తద్వారా శరీరంలో ప్రోటీన్ లోపం ఉండదు. ముఖ్యంగా పెసర పప్పు కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. కాబట్టి డైట్‌లో ఉన్నవారు కూడా పెసరపప్పు తింటే ప్రొటీన్ లెవెల్స్ అదుపులో ఉంటాయి జిమ్, యోగా లేదా ఇతర శారీరక శ్రమలలో పాల్గొనే వారికి పెసరపప్పు, కందిపప్పు, శనగల మొలకలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఇందులో అధిక ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, ఐరన్ తగినంత మొత్తంలో ఉంటాయి. ఇంకా వీటిని కూరగా లేదా.. ఉడకబెట్టుకుని కూడా తినవచ్చు.. అందుకే డైలీ ఒక కప్పు పప్పును తింటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## రొమాన్స్ పండు.. ఉదయాన్నే పరగడుపున తింటే ఆ సమస్యలకు చెక్ పెట్టినట్లే.. ట్రై చేయండి..



ప్రస్తుత కాలంలో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. కావున ఆరోగ్యంపై దృష్టిసారించడం మంచిది.. అందుకే ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి పండ్లలో కర్బూజ ఒకటి.. దీనిలోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. కర్బూజ పండులో నీటిశాతం ఎక్కువ.. కావున దీన్ని తినడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే, ప్రతి రోజూ ఉదయాన్నే కర్బూజ తినడం వల్ల చాలా వ్యాధులకు చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ముఖ్యంగా వేసవి కాలంలో కర్బూజను తినడం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. శరీరంలో నీటి కొరతను, పోషకాల కొరతను నివారించాలంటే దీనిని తప్పనిసరిగా తినాలి.. ముఖ్యంగా పరగడుపున (ఖాళీ కడుపుతో) తింటే చాలా మేలు జరుగుతుంది. కర్బూజ ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. కర్బూజను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం: కర్బూజను రోజూ తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. దీనిలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంద. ఇది మీ రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా సహాయపడుతుంది. రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో ఇది మీకు చాలా సహాయపడుతుంది. దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా ప్రయోజనాలను పొందవచ్చు. కడుపు సమస్యలు దూరం: వేసవి కాలంలో ప్రజలకు కడుపు సంబంధిత సమస్యలు మొదలవుతాయి. అజీర్తి, మలబద్దకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతుంటారు. అయితే, ఈ సీజన్‌లో ఎక్కువ నూనె, మసాలాలు తీసుకోవడం చాలా ప్రమాదకరం. కావున, అలాంటివి తగ్గించి.. తేలికపాటి వస్తువులను అంటే సులభంగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కావున కర్బూజను తినడం చాలా మంచిది. కంటి సంబంధిత సమస్యలు: కర్బూజ తినడం వల్ల కంటి సంబంధిత సమస్యలు కూడా నయమవుతాయి. విటమిన్ ఎ బీటా కెరోటిన్ కర్బూజలో లభిస్తుంది. ఇది మీ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా మీకు చాలా సహాయపడుతుంది. లైంగిక సమస్యల నుంచి ఉపశమనం: కర్బూజలోని విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. దీని వలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల లైంగిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.. వాటి నుంచి బయటపడేందుకు నిత్యం పలు రకాల మందులు వాడుతుంటారు. అలాంటి వారు రోజూ పుచ్చకాయను తీసుకుంటే.. కిడ్నీల్లో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు..

## ఒక్కటి.. ఒకే ఒక్కటి.. పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..? అమేజింగ్ అంతే..

అరటిపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. ఎప్పటికీ అందుబాటులో ఉండే అరటిపండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. అందుకే.. ఆరోగ్యానికి మేలు చేసే అరటిపండును తింటే.. శరీరానికి అనేక ప్రయోజనాలను కలుగుతాయని పేర్కొంటున్నారు.. అయితే, పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల నిద్ర, జీర్ణక్రియతోపాటు మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. నిద్రపోయే ముందు అరటిపండును తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా.. మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి నిద్రను నియంత్రించడంలో సహాయపడే న్యూరోట్రాన్స్‌మిటర్‌లు. కండరాల సడలింపు: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: అరటిపండ్లు మితమైన గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అంటే అవి నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. పడుకునే ముందు ఒకటి తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే అవాంతరాలను నివారించవచ్చు. ఆకలి బాధను నివారిస్తుంది:అరటిపండ్లు ఫైబర్ కు మంచి మూలం.పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. నిరంతరాయంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.. అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.




# 23న ప్రభాస్ బర్త్‌డే వేడుకలు

## భారీ ఏర్పాట్లలో అభిమనా సంఘాలు


ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరో ఎవరంటే వెంటనే గుర్తొచ్చేది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. గతేడాది సలార్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్న ఇతడు.. లేటెస్ట్‌గా కల్కి 2898 ఏడీతో మరో బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఈ రెండు సినిమాలకు సీక్వెల్స్ రానున్నాయి. అయితే సినిమాలతో పాటు ప్రభాస్ మరో మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ . ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే అక్టోబర్ 23న ప్రభాస్ బర్త్‌డే కావడంతో ఇప్పటినుంచే వేడుకలు మొదలుపెట్టారు అభిమానులు. ఇక బర్త్‌డే రోజు అతడు నటించే సినిమాల నుంచి అప్‌డేట్‌లు కూడా రానున్నాయి. ఇదిలావుంటే డార్లింగ్ బర్త్‌డే కానుకగా రాజాసాబ్ నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్?పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ వేదికలపై చాలా తక్కువ మాట్లాడతారు. ఇక ఇంటర్వ్యూలు, టాక్ షోలకు రావడం కూడా అరుదే. అలాంటిది చాలా రోజుల తర్వాత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిని గుర్తు చేసుకుంటూ నిర్వహిస్తున్న 'నా ఉచ్ఛ్వాసం కవనం ' కార్యక్రమానికి విచ్చేసి సందడి చేశారు. 'లిరిక్ దాని అందం. అర్థం. రాసేవాళ్లకు ఉన్న విలువ ఏంటో తెలియజెప్పిన వ్యక్తి 'సిరివెన్నెల' అని కొనియాడారు. ఆదివారం ఉదయం 9గంటలకు ఈటీవీలో ఈ కార్యక్రమం ప్రసారం కానుంది. ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లోనూ స్ట్రీమింగ్ కానుంది.



## సోషల్ మీడియాలో మంత్రగత్తెల వ్యాఖ్యలు

### మహిళల స్వేచ్ఛా స్ఫూర్తి అంటూ కంగనా కామెంట్స్

విలక్షణమైన నటన, వివాదాస్పద వ్యాఖ్యలతో ఎప్పుడు సోషల్ మీడియాలో కంగనా రనౌత్.. హల్ చల్ చేస్తుంటారు. ప్రభాస్ ఏక్ నిరంజన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకి పరిచయమైనా కంగనా బాలీవుడ్ చిత్రాలతో, పొలిటికల్ కామెంట్స్ తో అందరికి పరిచయమే. ప్రస్తుతం ఆమె నటించి దర్శక నిర్మాతగా వ్యవహరించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు సంబంధించిన వివాదం నడుస్తుండగా, ఆమె మరో పోస్ట్ తో వార్తల్లో నిలిచారు. మరో వైపు దీనికి స్టార్ హీరోయిన్ సమంత కూడా మద్దతు తెలిపింది. తాజాగా ఒక సోషల్ మీడియా వినియోగదారుడు 'మంత్రగత్తెలకు భయపడవద్దు.. వారిని కాల్చిన వారికి భయపడండి' అంటూ పోస్ట్ చేయగా అది వైరల్ అయ్యింది. ఈ పోస్ట్ రిప్లైగా కంగనా ఒక పోస్ట్ ని కోట్ చేసింది. 'మంత్ర గత్తెలు తమ ఉన్నత స్వభావానికి, అంతర్ దృష్టికి ప్రసిద్ధి. వారు స్వేచ్ఛా స్ఫూర్తితో అనుసంధానించ బడిన మహిళలు. లొంగని సంకల్ప శక్తి , హద్దులను ఛేదించాలనే అనియంత్రిత కోరికతో ఉంటారు. రహస్యంగా భయపడే పంజరంలో ఉన్నవారిని శపించబడిన వారిని బెదిరించే విచ్. ప్రతిభావంతులైన వ్యక్తులకు కొన్ని దుష్ట శక్తులు ఉన్నాయని వారిని బూడిద చేయాలని విశ్వసిస్తారు. దుఃఖం చాలా రూపాల్లో ఉంది. అసూయ అనేది అన్నింటికంటే దయనీయమైనది. మీరు అసూయపడాలని లేదా ప్రేరణ పొందాలని ఏదో ఒకటి ఎంచుకోవచ్చు.. కానీ తెలివిగా ఎంపిక చేసుకోండి.. ప్రేరణ పొందాలని ఎంచుకునే వారు తదుపరి ఎంపికల్లో విజయం సాధిస్తారు. పంజరాన్ని విచ్ఛిన్నం చేసి విముక్తి పొందండి. ఇలానే నేనొక మంత్రగత్తె' అని కంగనా రాసుకొచ్చింది. దీనికి హీరోయిన్ సమంత మద్దతు తెలుపుతూ.. తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా ప్రకటించింది. ప్రస్తుతం ఆమె నటించి దర్శక నిర్మాతగా వ్యవహరించిన ఎమర్జెన్సీ చిత్రం విడుదలకు సంబంధించిన వివాదం నడుస్తోంది. సెన్సార్ పరంగా ఇబ్బందులు నెలకొన్న విషయం తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ విషయంలో ఒక నిర్ణయానికి రావాలని ముంబై హైకోర్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఇటీవల ఆదేశించింది. దీంతో ఈ సినిమా రిలీజ్‌కు ఇంకా చిక్కులు తొలగలేదని భావిస్తున్నారు.




## చాలాకాలం తరవాత సలోని సందడి

### మట్కా సినిమాతో కమ్ బ్యాక్

రాయే రాయే రాయే రాయే రాయే సలోని జాము రాతిరేలా సందుచూసి జంప్ జిలాని అంటూ కుర్రకారుని ఉర్రుతలు ఊగించిన టాలీవుడ్ భామ సలోనీ చాలా రోజులకు తెరపై కనిపించబోతుంది. ఆమె కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మట్కా. వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం నుంచి తాజాగా సలోని ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో సలోని పద్మ అనే పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. మెగా హీరో వరుణ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు పలాస 1978 సినిమా ఫేం కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాను నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. 1958-1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. నవీన్ చంద్ర, కిశోర్, రవీంద్ర విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.



## సంక్రాంతి సినిమాలపై నాగవంశీ కామెంట్స్

### తప్పుగా ప్రసారం చేసారని ఆవేదన

సంక్రాంతికి విడుదల కానున్న సినిమాలపై ఇటీవల నిర్మాత నాగవంశీ చేసిన కామెంట్స్ వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. 'సంక్రాంతికి పోటీ ఉండదు' అని చేసిన వ్యాఖ్యలపై తాజాగా ఆయన క్లారిటీ ఇచ్చారు. తన కామెంట్స్‌ను కొందరు తప్పుదోవ పట్టించారని అసహనం వ్యక్తం చేశారు. 'సంక్రాంతికి ఆరు సినిమాలు వస్తాయి కదా.. పోటీ ఎక్కువగా ఉంటుందా..? అని అడిగిన ప్రశ్నకు నేను సమాధానం చెప్పాను. ఈసారి అన్ని సినిమాలు రావు. వచ్చినా.. పెద్దగా కాంపిటీషన్ ఉండదు అన్నాను. ఆ కామెంట్‌ను సోషల్ మీడియాలో తప్పుదోవ పట్టించారు. 'గేమ్ ఛేంజర్' సంక్రాంతికి వస్తుందని.. ఆ సినిమా మాకు పోటీ కాదని చెప్పినట్లు క్రియేట్ చేశారు. ఇందులో ఏమైనా అర్థముందా?. ఈసారి సంక్రాంతికి ఆరు సినిమాలు రావు.. మూడు వస్తాయి. ఇలా విడుదలవడం ఇండస్ట్రీలో సహజమే. నేను ఇచ్చిన ఈ స్టేట్‌మెంట్‌ను సోషల్ మీడియాలో వాళ్లకు అనుకూలంగా రాసుకున్నారు. ఒక ప్రొడ్యూసర్‌గా నేను మరొకరి సినిమా హిట్ కాకూడదని ఎందుకు కోరుకుంటాను?. తర్వాత నేను కూడా ఆ హీరోతో పనిచేయాల్సి వస్తుంది కదా.. ఈ విషయాన్ని ఎందుకు అర్థం చేసుకోలేరు' అని అసహనం వ్యక్తం చేశారు.రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గేమ్ ఛేంజర్' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో ప్రచారంలో భాగంగా ఇటీవల ఇందులోని 'రా మచ్చా.. ' పాటను విడుదల చేశారు. తాజాగా ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ సృష్టించడమే కాకుండా.. గ్లోబల్‌స్థాయిలో మెరుస్తోంది. దక్షిణా కొరియా సింగర్, డ్యాన్స్ కొరియోగ్రాఫర్ పార్క్ మిన్ తన బృందంతో కలిసి ఈ పాటకు స్టెపులేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇది చూసిన వారంతా 'విడుదలకు ముందే ఈ సినిమా గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది' అని కామెంట్ చేస్తున్నారు. 'గేమ్ ఛేంజర్' విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. దీపావళికి దీని టీజర్ వచ్చే అవకాశం ఉంది.



## పెళ్లిపనులతో నటి శోభిత బిజీ

### మొదలైన హల్దీ కార్యక్రమం

తెలుగు నటి శోభితా ధూళిపాళ్ల తన పెళ్లి పనులు మొదలుపెట్టింది. టాలీవుడ్ నటుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్న విషయం తెలిసిందే. సమంతతో విడిపోయిన అనంతరం శోభితాతో ప్రేమలో పడ్డాడు నాగా చైతన్య. రీసెంట్‌గా వీరి ఎంగేజ్‌మెంట్ కూడా జరిగింది. నవంబర్‌లో వీరి పెళ్లి జరుగనున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తన పెళ్లికి సంబంధించి ఇప్పటినుంచే పనులు మొదలు పెట్టింది ఈ భామ. తాజాగా తన హల్దీ వేడుక కోసం కుటుంబ సభ్యులతో కలిసి వైజాగ్‌లోని తన ఇంట్లో పసుపు దంచుతున్న ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే పసుపు దంచడం దగ్గరికి వచ్చిందంటే పెళ్లి కూడా త్వరలోనే ఉంటుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సినిమాల విషయానికి వస్తే.. లవ్ సితార అంటూ రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది శోభితా ధూళిపాళ్ల (÷ూనీశిరతిబిజీ ఆరబ్గీ÷తూజ్గీ÷జీ). ఈ చిత్రం ప్రస్తుతం జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. నాగ చైతన్య విషయానికి వస్తే.. ప్రస్తుతం చందూ మొండేటితో తండేల్ అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తుంది.



## ఫ్యాషన్ వీక్‌కే ప్రత్యేక ఆకర్షణగా.. ర్యాంప్‌పై మృణాళ్ ఠాకూర్ మెరుపులు

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్ ప్లేలో ఉంటుంది బాలీవుడ్ భామ మృణాళ్ ఠాకూర్ (%వీతీబఖుశ్రీ ఎష్ట్రుఎబతీ%). బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది ఈ మరాఠీ ముద్దుగుమ్మ. ఎప్పటికప్పుడు మెస్మరైజింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తుంది మృణాళ్ ఠాకూర్. ఈ బ్యూటీ తాజాగా బాంబ్వే టైమ్స్ ఫ్యాషన్ వీక్ 2024లో సందడి చేసింది. సిల్వర్ కోటెడ్ ఫ్లోరల్ డిజైన్‌డ్ వైట్ కాస్ట్యూమ్స్‌లో హొయలుపోతూ ర్యాంప్ వాక్ చేసింది. అనూష రెడ్డి స్టన్నింగ్ అవుట్ ఫిట్‌లో ధగ ధగ మెరిసిపోతూ ఫ్యాషన్ వీక్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఫొటోలు, విజువల్స్ ఇప్పుడు నెటిజన్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం హిందీలో లో నటిస్తుండగా.. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. కాగా కొన్ని రోజుల క్రితం పాపులర్ కోసం కెమెరాకు స్టన్నింగ్ ఫోజులివ్వగా.. బ్లాక్ అండ్ గ్రీన్ కాస్ట్యూమ్స్‌లో మెరిసిపోతున్న మృణాళ్ ఠాకూర్ స్టిల్స్ ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com